www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211



వాంగ్‌చుక్ దీక్ష సక్సెస్.. కేంద్రానికి ఇదొక మేల్కొలుపు: అర్ధాంగి గీతాంజలి

సంపుటి : 04 సంచిక : 98 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com శనివారం 25 - 07 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



## వైజాగ్‌లో అదానీ ఎనర్జీకి రూ. 8,500 కోట్ల భారీ ప్రాజెక్ట్

- ఏపీలో రూ. 8,500 కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును దక్కించుకున్న అదానీ ఎనర్జీ
- వైజాగ్‌లో గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరా
- డేటా సెంటర్లు, డిజిటల్ ఇన్‌ఫ్రా వృద్ధికి కూడా ఈ ప్రాజెక్ట్ కీలకం
- 30 నెలల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యం

**విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ప్రముఖ సంస్థ అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ రాష్ట్రంలో రూ. 8,500 కోట్ల విలువైన భారీ ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును దక్కించుకుంది. విశాఖపట్నం ప్రాంతంలో ప్రతిపాదిత గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా - మిగతా 2 లో

## పిల్లలు పుడితే భారం కాదు
# ఆదాయంగా మార్చేశాం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- భవిష్యత్తులో పిల్లలే ఆస్తి
- వారు ప్రయోజకులైతే ఊహించని ఫలితాలు
- ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం డబ్బులు జమ చేస్తున్నాం
- మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు




**అమరావతి :** మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమాలతో రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సంస్కరణలు వచ్చి తీరతాయన్న విశ్వాసం బలపడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో మంత్రి లోకేశ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. మెగా ౹ావీ ఒక అద్భుతమైన కార్యక్రమమన్న ఆయన ఇవాళ తానూ ఓ విద్యార్థిలా, టీచర్‌లా, మెంటార్‌లా మారే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. పిల్లల పెంపకం సహా ఇంటి పనుల్లో తల్లిదండ్రులు ఇద్దరూ సమాన పాత్ర పోషించాలని సీఎం పిలుపునిచ్చారు. మీటింగ్‌కు తండ్రులు ఎక్కువ మంది రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి౹ావీ సభకు తండ్రులు రాకపోతే జరిమానా విధిస్తామని సరదా వ్యాఖ్యలు చేయడంతో సభలో నవ్వులు విరిశాయి. తల్లికి వందనం నిధులు పడ్డాయా అని సీఎం అడగ్గానే పడ్డాయంటూ పిల్లలు, తల్లిదండ్రులు చెప్పిన సమాధానంతో సభా ప్రాంగణం మార్మోగింది.సంతతి భారం కాదు, సంపద అనేలా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు - మిగతా 2 లో

## గిరిజన పాఠశాలలకు
# పక్కా భవనాలు



- రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్
- ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం
- వచ్చే ఏడాది నాటికి గిరిజన ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు
- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి 1.10 లక్షల మంది విద్యార్థులు చేరారన్న మంత్రి
- విలువలతో కూడిన విద్య అందించడమే లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి లోకేశ్

**అమరావతి :** వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో సొంత భవనాలు లేని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మిస్తామని, శిథిలావస్థలో ఉన్నవాటిని ఆధునికీకరిస్తామని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ - మిగతా 2 లో



## గడువుకు రెండేళ్ల ముందే బంగ్లాదేశ్ అధ్యక్షుడు రాజీనామా

- అధ్యక్ష పదవికి మహమ్మద్ షహబుద్దీన్ రాజీనామా
- ప్రభుత్వంతో విభేదాలు, షేక్ హసీనాతో సంబంధాలే కారణమని ఆరోపణలు
- డిసెంబర్‌లో స్వదేశానికి వస్తానని షేక్ హసీనా ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం

**ఢిల్లీ :** పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ఆ దేశాధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ తన పదవికి రాజీనామా చేశారు. ఐదేళ్ల పదవీకాలం ముగియడానికి మరో రెండేళ్ల సమయం ఉండగానే ఆయన ఈ - మిగతా 2 లో

## లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు
# కేంద్ర కేబినెట్ ఆమోదం



- జైలు శిక్షలు, జరిమానాలు మరింత పెంపు!
- కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లపై చర్చ
- 2024 ప్రవేశ పరీక్షల అక్రమ పద్ధతుల నివారణ చట్టంలో కీలక సవరణలకు సిద్ధం
- దోషులకు కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశాలు

**ఢిల్లీ :** ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతున్న వేళ వాటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లను అరికట్టే దిశగా కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంలో సవరణలు చేసి మరింత కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పేపర్ లీకేజీలపై కఠిన శిక్షలకు అవకాశమిచ్చే బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.ప్రశ్నపత్రాల లీక్‌లకు - మిగతా 2 లో

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కేంద్రం నో?

- స్పష్టం చేసిన ప్రభుత్వ వర్గాలు!
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం
- నీట్ లీక్ వివాదంలో ప్రధాన్ రాజీనామాకు పట్టుబడుతున్న సీజేపీ
- నష్టపరిహారం, కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం
- ప్రధాన్ రాజీనామాపై శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరిన కేంద్రం
- మంత్రి రాజీనామా చేస్తేనే ఆందోళన విరమిస్తామని విద్యార్థుల స్పష్టీకరణ



**ఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనలు ఉధృతం చేసినప్పటికీ, ఆయన రాజీనామాకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని తెలుస్తోంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి."రాజీనామా చేయడం చాలా తేలికైన నిర్ణయం. కానీ ప్రజలు మాకు అధికారం ఇచ్చింది బాధ్యతలను నిర్వర్తించడానికే తప్ప, పారిపోవడానికి కాదు. మేము వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని ఉన్నత స్థాయి ప్రభుత్వ - మిగతా 2 లో

## గుంతకల్లు-బళ్లారి మధ్య 3వ, 4వ
# రైల్వే లైన్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



- గుంతకల్లు-బళ్లారి రైల్వే లైన్ విస్తరణ
- రూ.1264 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టుకు కేంద్రం పచ్చజెండా
- ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని మూడు జిల్లాలకు చేకూరనున్న లబ్ధి
- భారీగా పెరగనున్న సరుకు రవాణా సామర్థ్యం, తగ్గనున్న రద్దీ
- 2028-29 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం

**ఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్‌లోని కీలకమైన రైల్వే జంక్షన్ గుంతకల్లు మీదుగా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గుంతకల్లు-బళ్లారి సెక్షన్‌లో మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. ఈ విస్తరణ పనుల కోసం మొత్తం రూ.1,264 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు కేంద్రం అధికారికంగా ప్రకటించింది.ఈ మల్టీట్రాక్ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని మూడు జిల్లాల గుండా వెళుతుంది. దీని ద్వారా భారతీయ రైల్వే నెట్‌వర్క్ సుమారు 46 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. 2028-29 నాటికి ఈ - మిగతా 2 లో

## ఢిల్లీలో జరిగిన నీట్ ఆందోళనల్లో కేసీఆర్ ఎందుకు లేరు?



- మహేశ్ కుమార్ గౌడ్
- బీజేపీతో బీఆర్ఎస్ పార్టీకి లోపాయకారీ ఒప్పందం ఉందన్న మహేశ్ గౌడ్
- వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపణ
- రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగులను వాడుకున్నారని విమర్శ

**హైదరాబాద్ :** ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎందుకు పాల్గొనలేదని టీపీసీసీ అధ్యక్షుడు - మిగతా 2 లో

## నీట్ కుట్రల వెనుక
# విదేశీ శక్తులు



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రం అహర్నిశలు కృషి చేస్తోందన్న బండి సంజయ్
- నీట్ ఘటనపై మోదీ తీవ్రంగా కలత చెందారని వ్యాఖ్య
- ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పారన్న బండి సంజయ్

**హైదరాబాద్ :** ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం - మిగతా 2 లో

## హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లను నివాస ప్రాంతాల్లోనే నిర్మించాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- ఓఆర్ఆర్ లోపల నిరుయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు గుర్తించాలి
- పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల స్థలాలను తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశం



**హైదరాబాద్ :** క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలోని నివాస ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని చెప్పారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల స్థలాలను తీసుకుని ఆ శాఖలకు వేరే చోట భూ కేటాయింపులు చేయాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో వివిధ శాఖలకు సంబంధించిన స్థలాలు గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని తెలిపారు.క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఇప్పటికే లాంఛనంగా ప్రారంభించారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## జల వివాదాలకు ముగింపు నదుల అనుసంధానంతోనే!

(సి.హెచ్.ప్రతాప్)

"జలం జీవనం" అనే భారతీయ తత్వం నీటి ప్రాధాన్యాన్ని చాటిచెబుతోంది. అయితే దేశంలో ఒకవైపు వరదలు, మరోవైపు కరవు ప్రతి ఏడాది కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో నదులు ఉప్పొంగి సముద్రంలోకి లక్షల కోట్ల ఘనపు అడుగుల నీరు వృథాగా చేరుతుండగా, మరికొన్ని ప్రాంతాలు తాగునీరు, సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ పరిస్థితులు మరింత తీవ్రతరమవ ుతున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలు ఒక ప్రాంతంలో వరదలను సృష్టిస్తే, మరో ప్రాంతంలో వర్షాభావం రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది. ఈ అసమతుల్యతకు దీర్ఘకాలిక పరిష్కారంగా నదుల అనుసంధానం ప్రాజెక్టు ప్రాధాన్యం సంతరించుకుంది. భారతదేశంలో నీటి పంపిణీ విషయంలో అనేక రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా వివాదాలు కొనసాగుతున్నాయి. కావేరి జలాలపై కర్ణాటక--తమిళనాడు మధ్య, కృష్ణా జలాలపై ఆంధ్రప్రదేశ్--తెలంగాణ--కర్ణాటక--మహారాష్ట్ర మధ్య, మహదాయి (మండోవి) నదిపై గోవా--కర్ణాటక మధ్య, రవీ--బియాస్ జలాలపై పంజాబ్--హర్యానా మధ్య వివాదాలు తరచూ న్యాయస్థానాల వరకు చేరుతున్నాయి. వర్షపాతం అసమానత, పెరుగుతున్న నీటి అవసరాలు, రాష్ట్రాల మధ్య సమన్వయ లోపం ఈ సమస్యలను మరింత క్లిష్టం చేస్తున్నాయి. నీటి కొరత రాజకీయ వివాదాలకు, వ్యవసాయ సంక్షోభానికి, సామాజిక ఉద్రిక్తతలకు కూడా దారితీస్తోంది. నదుల అనుసంధానం ద్వారా నీటి లభ్యతను సమతుల్యం చేయగలిగితే ఇలాంటి వివాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. జాతీయ నదుల అనుసంధాన ప్రణాళికలో ప్రధానంగా హిమాలయ నదుల అనుసంధానం మరియు దక్షిణ ద్వీపకల్ప నదుల అనుసంధానం అనే రెండు విభాగాలు ఉన్నాయి. కెన్--బేత్వా అనుసంధాన ప్రాజెక్టు ఇప్పటికే అమలు దశలో ఉంది. అదనంగా గోదావరి--కృష్ణా, కృష్ణా--పెన్నా, పెన్నా--కావేరి, పార్--తాపీ--నర్మదా, దమన్‌గంగా--పింజల్, మహానది--గోదావరి వంటి అనుసంధాన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ముఖ్యంగా గోదావరి నదిలో వరదకాలంలో సముద్రంలోకి వెళ్లే అదనపు నీటిని కృష్ణా, పెన్నా, కావేరి పరివాహక ప్రాంతాలకు మళ్లించడం ద్వారా దక్షిణ భారత రాష్ట్రాలకు దీర్ఘకాలిక నీటి భద్రత లభించే అవకాశం ఉంది. భవిష్యత్తులో దేశంలోని వివిధ నదీ పరివాహక ప్రాంతాల మధ్య సమగ్ర జల నిర్వహణకు ఈ ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయి. నదుల అనుసంధానం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. కరవు ప్రాంతాలకు సాగునీరు అందడంతో వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుంది. తాగునీటి సమస్యలు తగ్గుతాయి. వరదల తీవ్రతను నియంత్రించవచ్చు. జలవిద్యుత్ ఉత్పత్తి పెరగడంతో పాటు భూగర్భ జలాలు పునరుద్ధరించబడతాయి. అంతర్గత జల రవాణా, చేపల పెంపకం, గ్రామీణ ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుంది. ఒక ప్రాంతంలో మిగులుగా ఉన్న నీటిని అవసరమైన ప్రాంతాలకు మళ్లించడం ద్వారా దేశ జల వనరులను మరింత సమర్థంగా వినియోగించుకోవచ్చు. రైతుల ఆదాయం పెరగడంతో పాటు పంటల వైవిధ్యం సాధ్యమవుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గే అవకాశం ఉంటుంది. పారిశ్రామిక అవసరాలకు నీటి లభ్యత మెరుగుపడటం వల్ల పెట్టుబడులు పెరిగి ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుంది. అయితే నదుల అనుసంధానం అమలులో పర్యావరణ పరిరక్షణ, అటవీ ప్రాంతాల సంరక్షణ, స్థానిక ప్రజల పునరావాసం, జీవ వైవిధ్య రక్షణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. నదుల సహజ ప్రవాహానికి భంగం కలగకుండా, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ప్రతి ప్రాజెక్టును అమలు చేయాలి. ఆధునిక సాంకేతికత, నీటి సంరక్షణ పద్ధతులు, వర్షపు నీటి నిల్వ, మైక్రో ఇరిగేషన్ వంటి చర్యలతో నదుల అనుసంధానాన్ని సమన్వయం చేస్తే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయి. రాష్ట్రాల మధ్య పరస్పర విశ్వాసం, పారదర్శక నిర్ణయాలు, కేంద్ర--రాష్ట్రాల సమన్వయం ఈ మహత్తర ప్రాజెక్టు విజయానికి కీలకం. "సర్వే జనాః సుఖినో భవంతు" అనే భారతీయ భావనకు అనుగుణంగా నీరు ప్రతి ప్రాంతానికీ సమానంగా చేరినప్పుడే జల భద్రత, ఆహార భద్రత, దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. నదుల అనుసంధానం కేవలం ఇంజినీరింగ్ ప్రాజెక్టు కాదు; భావితరాలకు నీటి భద్రతను అందించే జాతీయ సంకల్పం, సమగ్ర భారత నిర్మాణానికి బలమైన పునాది.

## వైజాగ్‌లో అదానీ ఎనర్జీకి రూ. 8,500 కోట్ల భారీ ప్రాజెక్ట్

మొదటిపేజీ తరువాయి - చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీని ద్వారా సుమారు 4,500 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం నిర్వహించిన టారిఫ్-ఆధారిత పోటీ బిడ్డింగ్ (టీబీసీబీ) విధానంలో అత్యంత పోటీతత్వ ధరను కోట్ చేసి అదానీ ఎనర్జీ ఈ ప్రాజెక్టును కైవసం చేసుకుంది. ఒప్పందం ప్రకారం.. ఈ ప్రాజెక్టును 30 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రాజెక్టును 'వైజాగ్ పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్' అనే ప్రత్యేక సంస్థ (ఎస్‌పీవీ) కింద నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టుపై అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ సీఈఓ కందర్ప్ పటేల్ మాట్లాడుతూ.. "భారతదేశ పారిశ్రామిక ప్రగతికి అవసరమైన ఇంధన మౌలిక సదుపాయాల నిర్మాణంలో వైజాగ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన ముందడుగు. ఇది ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సామర్థ్యం అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే కాకుండా, పెందుర్తి-విశాఖపట్నం ప్రాంతంలో పెరుగుతున్న డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిమాండ్‌కు గ్రిడ్‌ను బలోపేతం చేస్తుంది" అని వివరించారు. ప్రస్తుతం విశాఖపట్నం డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ పెద్ద ఎత్తున ఏఐ, హైపర్‌స్కేల్ డేటా సెంటర్ల అభివృద్ధి, సబ్‌సీ కనెక్టివిటీ, లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ వంటివి రానున్నాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఈ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది. ఈ ప్రాజెక్ట్‌తో ఏఈఎస్-ఎల్ తన నెట్‌వర్క్‌కు అదనంగా 1,582 సర్క్యూట్ కిలోమీటర్ల (సీకేఎం) ట్రాన్స్‌మిషన్ లైన్లు, 10,500 ఎంవీఏ ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యాన్ని జోడించనుంది. దీంతో కంపెనీ మొత్తం ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ 29,531 సీకేఎంకు, ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం 1,33,675 ఎంవీఏకు చేరుకుంటుంది. దేశంలో అతిపెద్ద ప్రైవేట్ ట్రాన్స్‌మిషన్ కంపెనీగా ఏఈఎస్ఎల్ కొనసాగుతోంది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కేంద్రం నో?

మొదటిపేజీ తరువాయి - వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో నెలకొన్న వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడంపైనే ప్రస్తుతం ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న సీజేపీ విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రతినిధులుగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, శాంతియుత నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం, మంత్రి రాజీనామా విషయంలో మాత్రం శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరినట్లు కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, అభిజీత్ దీప్కే తేల్చి చెప్పారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని బదిలీ చేసి, కీలక విభాగాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇతర విద్యా సంబంధిత అంశాలపై సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరిస్తూనే, పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను షేర్ చేస్తున్నారు.

## గడువుకు రెండేళ్ల ముందే బంగ్లాదేశ్ అధ్యక్షుడు రాజీనామా



మొదటిపేజీ తరువాయి - కీలక నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాం శమైంది. అయితే, అనారోగ్య కారణాల వల్లనే ఆయన పదవి నుంచి తప్పుకున్నారని స్థానిక మీడియా వెల్లడి ంచింది. ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం తో విభేదాలు, మాజీ ప్రధాని షేక్ హసీనాతో ఉన్న సన్నిహిత సంబంధాలే ఈ రాజీనామాకు ప్రధాన కారణాలని తెలుస్తోంది. 2024లో విద్యార్థి ఉద్యమం నేపథ్యంలో అధికారాన్ని కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా, డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి వస్తానని ఇటీవలే ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది రోజులకే అధ్యక్షుడు రాజీనామా చేయడం గమనార్హం. 2023లో షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ మద్దతుతో షహబుద్దీన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత, ఆ నాటి పాలనకు సంబంధించి కీలక రాజ్యాంగ పదవిలో కొనసాగుతున్న చివరి వ్యక్తి ఆయనే. ఆయన పదవీకాలం 2028 ఏప్రిల్ వరకు ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ముందుగానే తప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. షేక్ హసీనా పదవీచ్యుతురాలైనప్పటి నుంచి షహబుద్దీన్ అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలని భావిస్తున్నట్లు గతంలోనే సంకేతాలిచ్చారు. తాజాగా ఆయన రాజీనామా చేయడంతో, బంగ్లాదేశ్ రాజ్యాంగ నిబంధనల ప్రకారం పార్లమెంట్ స్పీకర్ హఫీజుద్దీన్ అహ్మద్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# పిల్లలు పుడితే భారం కాదు ఆదాయంగా మార్చేశాం

మొదటిపేజీ తరువాయి -

అన్నారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి ఉన్నత విద్య అభ్యసించేవరకూ ప్రభుత్వమే అండగా నిలిచేలా వివిధ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి. పిల్లలు పుడితే భారం కాదు, ఆదాయంగా మార్చేశాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం డబ్బులు జమ చేస్తున్నామన్నారు. 67 లక్షల మంది పిల్లలకు రూ.10,120 కోట్లు జమ చేసినట్టు వివరించారు. గిరిజన ప్రాంతాల్లోనే 5లక్షల మందికి రూ.664 కోట్లు వారి ఖాతాల్లో వేశామని చెప్పారు."ఆర్థిక అసమానతలు తగ్గించాలని ధ్యేయంగా పెట్టుకున్నాం. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే అభివృద్ధిని నడిపిస్తున్నాం. పీ4 కార్యక్రమంతో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నాం. అప్పులు కాదు, ఆదాయాన్ని పెంచాలి. పిల్లలు సమాజానికి ఉపయోగపడాలి. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉంది. విద్యా వ్యవస్థకు వెన్నెముక ఉపాధ్యాయులు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి, పిల్లలు ప్రయోజకులైతే ఊహించని ఫలితాలు వస్తాయి. సమాజంలో టీచర్లకు మంచి గుర్తింపు ఉంది. శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. పిల్లలు ఆనందంగా ఉంటే బాగా చదువుతారు. అందుకే వారికి పౌష్టికాహారం అందిస్తున్నాం. ఆగస్టు నుంచి సంజీవని ప్రాజెక్టు రాబోతోంది." అని సీఎం తెలిపారు. విద్యార్థులకు మార్కులు తగ్గితే మంత్రి లోకేశ్‌కు కూడా మార్కులు తగ్గిస్తానని సీఎం చంద్రబాబు ఛలోక్తి విసిరారు. మంత్రి లోకేశ్ విద్యాశాఖ కావాలని కోరినప్పుడు, న్యాయం చేయగలడా అనే అనుమానం ఉండేదని కానీ అద్భుత పనితీరు కనబరుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. సీఎం సర్ నేను పెద్దయ్యాక అయ్యి మిమ్మల్ని కలుస్తాను అని విద్యార్థి చెప్పిన మాటలకు చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో మాట్లాడిన విద్యార్థి సాకేత్‌ను చంద్రబాబు మెచ్చుకున్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో 'డ్రగ్స్ వద్దు బ్రో' అంశంపై మాట్లాడిన విద్యార్థి సాకేత్‌ను సీఎం పిలిచి అభినందనలు తెలిపారు. అదే సమయంలో నేను ఐఏఎస్ అవుతాను అని సీఎంకు విద్యార్థి చెప్పటంతో వెంటనే మైక్ అందుకున్న చంద్రబాబు విజన్ అంటే ఇదే అంటూ ప్రసంశించారు. 'డేర్ టూ డ్రీమ్ స్ట్రైవ్ టూ ఎచివ్' అన్న మాటను విద్యార్థులంతా గుర్తు పెట్టుకుని ముందుకెళ్లాలన్నారు. విద్యార్థుల లక్ష్యాలను గుర్తించి తల్లిదండ్రులు, టీచర్స్ నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. సభలో తల్లికి వందనం లబ్ధిదారులతో సీఎం మాట్లాడారు. డబ్బుల జమపై లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డబ్బులు అందాయన్న మహిళలు ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లను సీఎంకు చూపించారు. తల్లికి వందనం అందించడంపై మహిళల హర్షం వ్యక్తం చేశారు. ఈ డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని వారికి సీఎం సూచించారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని, అందుకోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను విద్యాశాఖ మంత్రి లోకేశ్ వివరించారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. ఆ దిశగా ఇప్పటికే అడుగులు వేస్తోందన్నారు. తల్లికివందనం లక్ష్యం కేవలం ఆర్థికసాయమే కాదని తల్లిని, గురువును గౌరవించాలనే సదుద్దేశం ఇందులో దాగి ఉందన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో ఇద్దరు దైవాలు ఉంటారని మొదటి దైవం తల్లిదండ్రులైతే, రెండో దైవం గురువు అనే విషయం అందరూ గుర్తుంచుకోవాలన్నారు.

# గిరిజన పాఠశాలలకు పక్కా భవనాలు

మొదటిపేజీ తరువాయి -

శాఖల మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో పెరిగిన విశ్వాసంతో ఈ ఏడాది 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఇది రెండేళ్ల తమ ప్రభుత్వ కృషికి నిదర్శనమని ఆయన అన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణల ఫలాలను వివరించారు."మనందరి రెండేళ్ల కృషి ఫలించింది. చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల ముందు 'నో అడ్మిషన్' బోర్డులు చూస్తున్నాం. ఇది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమష్టి విజయం. వారే ప్రభుత్వ పాఠశాలలకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు" అని లోకేశ్ అన్నారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలో ఒక తల్లి తన బిడ్డకు ప్రభుత్వ పాఠశాలలో సీటు ఇప్పించాలని అడగడం తనను ఆశ్చర్యపరిచిందని, ప్రభుత్వ బడుల్లో సీట్లకు డిమాండ్ పెరగడం ఉపాధ్యాయుల కఠోరశ్రమకు నిదర్శనమని కొనియాడారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొస్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చానని, ఆ మాట నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగానే 'తల్లికి వందనం' పథకాన్ని గత ప్రభుత్వానికి భిన్నంగా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ వర్తింపజేస్తున్నామని స్పష్టం చేశారు. 2025లో 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ. 10,090 కోట్లు, 2026లో 67.47 లక్షల మందికి రూ. 10,120 కోట్లు అందించామని గణాంకాలతో సహా వివరించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, పారదర్శకమైన టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తీసుకొచ్చామని తెలిపారు. విలువలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించుకున్నామని లోకేశ్ చెప్పారు. 'తల్లికి చెప్పలేని పనేదీ చేయొద్దు' అనే ఆయన మాట ఎంతో శక్తిమంతమైనదని, ఆ విలువలను విద్యార్థుల్లో నింపేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మహిళలను కించపరిచే ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, "మహిళల జోలికొస్తే లోకేశ్ అన్న తోలు తీస్తాడు అని వార్నింగ్ ఇవ్వండి" అంటూ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితంలో తల్లి, గురువు పాత్రను గుర్తుచేస్తూ, ప్రతి గొప్ప వ్యక్తి వెనుక ఒక గొప్ప తల్లి, ఒక గొప్ప గురువు ఉంటారని అన్నారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రికార్డులు సృష్టించారని, చరిత్రలో తొలిసారిగా టాపర్ల ఫొటోలతో ప్రభుత్వమే ప్రకటనలు ఇచ్చిందని గుర్తుచేశారు. "మీ మార్కులే నా ప్రోగ్రెస్ రిపోర్ట్. మీరు బాగా చదివితేనే సీఎం నాకు మంచి మార్కులు వేస్తారు. నా భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అని విద్యార్థులతో అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు నడిచిన రంపచోడవరం గడ్డపై మెగా పీటీఎం నిర్వహించడం గర్వంగా ఉందని, రాష్ట్ర భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని లోకేశ్ పిలుపునిచ్చారు.

# లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

మొదటిపేజీ తరువాయి - పాల్పడే వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన మార్పులపై దృష్టి సారించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను మరింత బలోపేతం చేసి, నిందితులకు దీర్ఘకాల జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించేలా ముసాయిదా బిల్లును సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆ అంశంపై గురువారం ప్రధాని మోదీ ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని, ఇలాంటి ఘటనలను ఏ మాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. లీక్‌లకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, కేసుల విచారణను వేగంగా పూర్తి చేసే విధానాన్ని కూడా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం ప్రకారం, వ్యక్తిగతంగా ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిపై 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే వ్యవస్థీకృతంగా జరిగే నేరాల విషయంలో 5 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రవేశ పరీక్షల లీక్ ఘటనల నేపథ్యంలో ఈ శిక్షలు సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో జైలు శిక్షల కాలాన్ని పెంచడం, జరిమానాల మొత్తాన్ని భారీగా పెంచడం వంటి అంశాలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో భాగమైన అధికారులు లేదా వ్యవస్థీకృత నేర ముఠాలు ప్రమేయం ఉన్న కేసుల్లో మరింత కఠిన నిబంధనలు అమలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక, పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేయడంపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దిల్లీలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కాగా, త్వరలో మరో నాలుగు కోర్టులను కూడా ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని సమాచారం. ఈ కోర్టుల్లో పేపర్ లీక్‌లకు సంబంధించిన కేసులను ఏడాది లోపే విచారించి తీర్పులు ఇవ్వాలనే లక్ష్యంతో చట్టంలో సవరణలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇలాంటి కేసుల విచారణకు ఎక్కువ సమయం పడుతుండటంతో నిందితులకు శిక్షలు ఆలస్యమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేగవంతమైన న్యాయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## గుంతకల్లు-బళ్లారి మధ్య 3వ, 4వ రైల్వే లైన్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి -

ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ కొత్త లైన్ల నిర్మాణం వల్ల దాదాపు 99 గ్రామాలకు మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రాంతాల్లోని సుమారు 7 లక్షల మంది ప్రజలకు ఇది ప్రయోజనం చేకూరుస్తుంది. అంతేకాకుండా, బళ్లారి కోట, శ్రీ కుమార స్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాలకు రైలు సౌకర్యం మరింత మెరుగుపడుతుంది. గుంతకల్లు-బళ్లారి మార్గం ఇనుప ఖనిజం, డోలమైట్, సున్నపురాయి, ఉక్కు, బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు వంటి నిత్యావసర సరుకుల రవాణాకు అత్యంత కీలకమైనది. ఈ లైన్ల సామర్థ్యం పెంచడం ద్వారా ఏటా అదనంగా 16.22 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసేందుకు వీలవుతుందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఈ మార్గంలో రద్దీ తగ్గి, రైళ్ల రాకపోకలు వేగవంతం అవుతాయి. పర్యావరణ హితమైన రవాణా విధానంగా రైల్వే నెట్‌వర్క్ విస్తరణ దోహదపడుతుందని కేంద్రం పేర్కొంది. ఈ ప్రాజెక్టు ద్వారా దేశ చమురు దిగుమతులు ఏటా 1.32 కోట్ల లీటర్ల మేర తగ్గుతాయని, కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు 6.67 కోట్ల కిలోలు తగ్గుతాయని తెలిపింది. ఇది 0.27 కోట్ల చెట్లను నాటడంతో సమానమని వివరించింది. పీఎం-గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు, ప్రజలు, వస్తువులు, సేవల కదలికలకు అతుకులు లేని కనెక్టివిటీని అందిస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి జరిగి, ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజలు 'ఆత్మనిర్భర్'గా మారతారని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు

మొదటిపేజీ తరువాయి - అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు. నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, ఇప్పటికే సీబీఐ విచారణ వేగవంతం చేసి 11 మంది ఫ్యాకల్టీ సహా మొత్తం 17 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకూడదనే ఉద్దేశంతో కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను కూడా వెల్లడించామని వివరించారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు తీవ్ర అరాచకం సృష్టించాయని ఆయన ఆరోపించారు. ఏకంగా దేశ పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు చేస్తూ, దేశ వ్యతిరేక నినాదాలతో విరుచుకుపడ్డారని మండిపడ్డారు. నిరసనల పేరుతో పోలీసులపై, మహిళా జర్నలిస్టులపై అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులు చేశారని విమర్శించారు. ఈ హింసలో 118 మంది పోలీసుల తలలు పగిలి తీవ్ర గాయాలైనా, అత్యంత సంయమనం పాటిస్తూ ఫైరింగ్ చేయలేదని, శాంతిభద్రతల రక్షణ కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఢిల్లీలో చెలరేగిన ఈ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర కోణం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలో విష ప్రచారం చేస్తూ, దేశంలో అశాంతిని రేపేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, భారత్‌లో అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను తక్షణమే బ్లాక్ చేసిందని బండి సంజయ్ తెలిపారు.

# హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లను నివాస ప్రాంతాల్లోనే నిర్మించాలి

మొదటిపేజీ తరువాయి - తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్ నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వం తొలి విడతలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనుంది. మిగతా నియోజకవర్గాల్లోనూ ఖాళీ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, వి.శేషాద్రి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, కలెక్టర్ ప్రియాంక ఆల,



ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అల్పాదాయ వర్గాలకోసం నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకోసం ఈనెల 21 నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మీ సేవ కేంద్రాలు, మీ సేవ వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ బోర్డు తెలిపింది. రూ.100 దరఖాస్తు ఫీజుతో పాటు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఒక వేళ ఫ్లాట్ రాకపోతే రూ.10 వేలు తిరిగి ఇస్తామని, వస్తే లబ్ధిదారుల వాటాలో తగ్గిస్తామని సర్కారు వెల్లడించింది.

**లబ్ధిదారులకు అవసరమైన అర్హతలు :**

కనీసం పదేళ్ల నుంచి క్యూర్ పరిధిలోనే నివసించి ఉండాలి.

వార్షిక కుటుంబ ఆదాయం మొత్తం రూ.6 లక్షల వరకే ఉండాలి.

సొంత ఇళ్లు, ఫ్లాట్ లేదా ప్లాటు ఉండకూడదు.

ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలి.

గతంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి గృహ ప్రయోజనం పొంది ఉండకూడదు.

లబ్ధిదారులకు మొత్తం రూ.11 లక్షల్లో స్థలంతో పాటు రూ.5 లక్షల రాయితీని ప్రభుత్వం ఇస్తుంది. రూ.6 లక్షలను మాత్రం లబ్ధిదారులు చెల్లించాలి.

# ఢిల్లీలో జరిగిన నీట్ ఆందోళనల్లో కేసీఆర్ ఎందుకు లేరు?

మొదటిపేజీ తరువాయి - మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీతో ఉన్న లోపాయకారీ ఒప్పందం కారణంగానే బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి నిరసన తెలపలేకపోయారని ఆయన విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు తెచ్చుకుని, వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపించారు. దేశంలో పలు ప్రాంతీయ పార్టీల వలే బీఆర్ఎస్ కూడా బీజేపీ గుప్పిట్లోనే ఉందనేది పచ్చి నిజమని, అందుకే గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రతిపాదించిన బిల్లులన్నింటికీ బీఆర్ఎస్ మద్దతుగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లకపోయినా, నీట్ ఉద్యమానికి పూర్తిస్థాయిలో మద్దతుగా నిలిచారని అన్నారు. నెల రోజులుగా నీట్ సమస్యపై స్పందించని బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ధర్నా చౌక్ వద్ద కూర్చుని నాటకాలు ఆడుతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎన్ని వేషాలు వేసినా ప్రజలు ఇక నమ్మే పరిస్థితి లేదని, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లోకి వెళ్లే ధైర్యం వారికి ఉందా అని నిలదీశారు. గత పాలనలో ఎంతోమంది విద్యార్థుల బలవన్మరణాలకు, నిరుద్యోగుల ఆత్మహత్యలకు బాధ్యులెవరని ప్రశ్నించారు. కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసమే నిరుద్యోగులను వాడుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సాగిన పోలీసు రాజ్యం, విచ్చలవిడిగా జరిగిన ఇసుక మాఫియా దోపిడీని తెలంగాణ ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన ధ్వజమెత్తారు. నీళ్ల ప్రాజెక్టుల గురించి హరీశ్ రావు మాట్లాడుతున్నారని, కానీ వారి పాలనలో నీళ్ల పేరుతో జరిగిన భారీ దోపిడీ, అక్రమాలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని స్పష్టం చేశారు.



www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# రంపఎర్రంపాలెం జడ్పీ హై స్కూల్ లో వైభవంగా మెగా పేరెంట్స్ డే వేడుకలు

**విద్యార్థులచే తల్లులకు పులాభిషేకం**

**ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థినుల వేషధారణలు**

**గోకవరం,జులై 24 .అక్షర టైమ్స్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలలో ఈరోజు నిర్వహించిన మెగా పేరెంట్స్ డే గోకవరం మండలం రంపఎర్రంపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ లో అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు అబ్బులు కన్వీనర్ గా వ్యవరించాగా తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గంటా శ్రీను అధ్యక్షతన జరిగింది.పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు పెద్దిరెడ్ల రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ ఉంగరాల రాము, తాజా మాజీ సర్పంచ్ బాదంపూడి హర్షిత ప్రకాష్, తల్లిదండ్రుల కమిటీ జిల్లా పరిషత్ హై




స్కూల్ మొట్టమొదటి చైర్మన్ నందం పాపారావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు సత్యం పెద్దబ్బులు అనే వెంకటేశ్వరరావు, మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బత్తిన రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయుడు వంగలపూడి వెంకటేశ్వరరావు, మరో విశ్రాంతి ఉపాధ్యాయుడు తోట్టా మల్లేశ్వరరావు, పెనుగొండ సత్యానందం, పప్పు బుజ్జి, షేక్ మగ్ధం, అడబాల వెంకటేశ్వరరావు (అబ్బు),జాజుల అవతారం రఫీ,గుల్లింకల నాని ,రామకృష్ణ,స్కూల్ మేట్ ట్రస్ట్ ప్రెసిడెంట్ కాకర విష్ణు, చిక్కం రమేష్ పలువురు గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించిన మెగా పేరెంట్స్ డే లో పాఠశాల ఘనతను వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఉపాధ్యాయుడు పెదరెడ్ల రాజు మాస్టర్ చక్కని తన వాక్చాతుర్యంతో ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులచే తమతమ తల్లులను పూలతో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాల ముద్దు అనే పాటకు నృత్య ప్రదర్శన విద్యార్థులతో చేయించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులచే వివిధ వేషధారణలు సభ వేదికపై ఉన్న పెద్దలను విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి అనంతరం సహపంతి భోజనాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కె రామకృష్ణ,కె వరలలక్ష్మి,పెనుగొండ కుమారి,భాస్కరరావు,ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం పట్టణ పాఠశాలలు కళాశాలలో మెగా పీటీఎం4.0

**ముఖ్య అతిథిగా హాజరైన బొధిరెడ్డి గోపి మూది నారాయణస్వామి**

**ఏలేశ్వరం,జులై 24 .అక్షర టైమ్స్ :** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మున్సిపాలిటీ లో గల పాఠశాలలు, కళాశాలలో మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ (గాపీ)--4.0 కార్యక్రమాన్ని పట్టణ పరిధి పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి పట్టణ నాయకులు బొద్దిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మెగా పేరెంట్--టీచర్ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, ఆరోగ్యం తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు ఆటల పోటీలలో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని అలరించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీట్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను తదితర అంశాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు చర్చించుట ద్వారా






వారిని ఉన్నత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెరిగిందని బుజ్జి తెలిపారు, విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభావంతులుగా ఉండేందుకు పోటీ తత్వంతో విద్యను అభ్యసించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాల పట్ల అవగాహన, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, నైతిక విలువలు, క్రమశిక్షణ, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపైఆయా శాఖల అధికారులు విలువైన సందేశాలను అందించారు. తల్లిదండ్రులు పిల్లల విద్యాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎంఈఓ2వరలక్ష్మి ,వైద్యాధికారి డాక్టర్ సౌభాగ్య,నాయకులు , మామిడి లలిత,కోణాల వెంకట రమణ, రుచి రమేష్, సామంతుల గోపి, పెంద్ర శ్రీను, రాయుడు చిన్న, శంఖాని బాబ్జి,కళాశాల అధ్యాపకులు,అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**నీట్ అక్రమాలపై విద్యార్థుల గళం**

**ఈసీఐఎల్‌లో కేంద్రానికి హెచ్చరిక**

**కాప్రాజులై 24 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో చోటుచేసుకున్న అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యార్థుల భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), జాతీయ విద్యార్థి సంఘం, యువ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈసీఐఎల్ కూడలిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు విశేషంగా స్పందించడంతో కార్యక్రమం విజయవంతమైందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం అవినీతి, నిర్లక్ష్యం, అసమర్థతతో సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న అవకతవకలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.ఉప్పల్ నియోజకవర్గ జాతీయ విద్యార్థి సంఘం




అధ్యక్షుడు బి. కిషోర్, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్ మాట్లాడుతూ నీట్ ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేయాలని లేదా ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.ప్రవేశ పరీక్షలను నిర్వహించే జాతీయ పరీక్షల సంస్థ అవినీతికి కేంద్రంగా మారిందని ఆరోపించిన వారు, సంస్థ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసనలు చేపడుతుంటే ఢిల్లీలో పోలీసులతో లాఠీచార్జీలు, బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు విమర్శించారు. సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం నిరసనలను అణచివేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, జాతీయ విద్యార్థి సంఘం నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్, యువ కాంగ్రెస్ నాయకుడు లింగస్వామి, ఏఐవైఎఫ్ నాయకులు వికాస్ రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా భారీ షెడ్ నిర్మాణం.?

**కీసరలో అక్రమ నిర్మాణాలపై చర్చలు.. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**

**మున్సిపల్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, టీఎస్ఐఐసీ**

**అనుమతులపై సందేహాలు - విచారణకు డిమాండ్**

**కీసర,జులై 24 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో భారీ షెడ్ నిర్మాణం కొనసాగుతున్న తీరు ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందకుండానే నిర్మాణ పనులు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తుండగా, అధికారులు మాత్రం ఈ వ్యవహారంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, భారీ స్థాయిలో ఇనుప స్తంభాలు ఏర్పాటు చేసి షెడ్ నిర్మాణాన్ని వేగంగా కొనసాగిస్తున్నప్పటికీ, మున్సిపల్ అనుమతి, టౌన్ ప్లానింగ్ అనుమతి, రెవెన్యూ శాఖ నుంచి భూ వినియోగానికి సంబంధించిన స్పష్టత, టీఎస్ఐఐసీ పరిధిలో ఉంటే ఆ శాఖ నుంచి అవసరమైన అనుమతులు తీసుకున్నారా లేదా అన్న విషయంపై ఎలాంటి సమాచారం బయటకు రావడం లేదని అంటున్నారు. నిర్మాణ స్థలంలో అనుమతుల వివరాలను ప్రదర్శించే బోర్డు కూడా



కనిపించకపోవడం సందేహాలను మరింత పెంచుతోందని పేర్కొంటున్నారు.భారీ నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు తనిఖీలు నిర్వహించకపోవడం విమర్శలకు దారితీసింది. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టినా అధికారులు వెంటనే నోటీసులు జారీ చేస్తారని, అయితే ఇంత పెద్ద నిర్మాణం జరుగుతున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కొందరి అండదండలతోనే ఈ నిర్మాణం కొనసాగుతోందా అనే అనుమానాలను కూడా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా, నిర్మాణ పనుల వద్ద కార్మికుల భద్రతా ప్రమాణాలు సక్రమంగా పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. హెల్మెట్లు, భద్రతా బెల్టులు, రక్షణ పరికరాలు లేకుండానే కార్మికులు ఎత్తైన ప్రాంతాల్లో పని చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. నిర్మాణ స్థలం భూ వినియోగం ఏ ప్రయోజనం కోసం కేటాయించబడింది? అక్కడ వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఉందా? నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందా? ఫైర్ సేఫ్టీ, పర్యావరణ, పార్కింగ్ వంటి అంశాల్లో అవసరమైన అనుమతులు పొందారా? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం లేకపోవడం స్థానికుల్లో సందేహాలను పెంచుతోంది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు తేలితే వెంటనే పనులను నిలిపివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వారికి ఎలాంటి మినహాయింపులు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటేనే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఈసీఐఎల్‌లో కిసాన్ ఫ్యాషన్ మాల్ ప్రారంభోత్సవం

**ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన దుస్తులు**

**హీరోయిన్ ప్రియాంక మోహన్ సందడితో**

**ప్రారంభోత్సవానికి ప్రత్యేక ఆకర్షణ**

**కాప్రా,జులై 24 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కిసాన్ ఫ్యాషన్ మాల్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్, నిజామాబాద్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ప్రముఖ తెలుగు సినీ నటి ప్రియాంక మోహన్ హాజరై సందడి చేయడంతో అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆమెతో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు అభిమానులు ఆసక్తి చూపగా, ప్రారంభోత్సవం సందడి వాతావరణంలో జరిగింది. ప్రారంభోత్సవం అనంతరం ప్రజాప్రతినిధులు, అతిథులు షాపింగ్ మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి ఏర్పాట్లు, వినియోగదారులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఈసీఐఎల్ ప్రాంతంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన వస్త్ర విపణి ప్రారంభం కావడం స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఒకే చోట మహిళలు, పురుషులు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన నాణ్యమైన దుస్తులు అందుబాటు ధరల్లో లభించేలా ఏర్పాటు చేయడం అభినందనీయమని





పేర్కొన్నారు. ఇటువంటి వాణిజ్య సంస్థలు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు స్థానిక ప్రాంత అభివృద్ధికి కూడా దోహదపడతాయని చెప్పారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ, హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో వాణిజ్య రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, కొత్తగా ఏర్పడుతున్న వ్యాపార సంస్థలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుస్తున్నాయని అన్నారు. ఇటువంటి సంస్థల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం శుభపరిణామమని, వ్యాపార రంగం అభివృద్ధి చెందితే స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, మహేష్ గౌడ్, కిసాన్ ఫ్యాషన్ మాల్ యాజమాన్యం, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా సినీ నటి ప్రియాంక మోహన్ హాజరు కావడంతో ప్రారంభోత్సవం మరింత ఆకర్షణీయంగా మారి, అభిమానుల సందడితో ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్ కళకళలాడింది.

# ఘనంగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి జయంతి



**గోకవరం,జులై 24 .అక్షర టైమ్స్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 136వ జయంతి ని ముక్కమల గ్రంథాలయ అధికారి ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రంథాలయం వద్ద అయ్యాంకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాలకు అయ్యంకి చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన ఊరురా పాదయాత్రలు చేసి ప్రతి గ్రామంలోని గ్రంథాలయాలను నెలకొల్పారని రిటైర్డ్ గంధాల అధికారి వివి సూర్యనారాయణ అన్నారు. చివరిగా సూర్యనారాయణ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కడియాల సాయి రామారావు, కరుటూరి విశ్వనాథం, పాతూరు వెంకటేశ్వరరావు, అబ్బూరి పుల్లయ్య, సుం కపల్లి మానసు, భోళా మంగారావు, మారే గోవిందు రాజు, కంఠంన కేశవ, చదవరులు, తదితలు పాల్గొన్నారు

# ఆగస్టు 3వ తేదీ లోగా ఓటరు సమాచార పత్రాలు అందజేయాలి బలరామ్ యాదవ్ విజ్ఞప్తి

**కొండాపూర్,జులై 24 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటు వేయడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరామ్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజలందరూ తమ ఓటు హక్కు పట్ల చైతన్యంతో వ్యవహరించాలని ఆయన కోరారు.కొండాపూర్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రజాబంధువులు, నివాసితులు తమ సమగ్ర వివరాలతో కూడిన ఓటరు సమాచార పత్రాలను (ఫారాలను) పూర్తి చేసి, ఆగస్టు 3వ తేదీ లోగా సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులకు తప్పకుండా అందజేయాలని పిలుపునిచ్చారు.



**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:**

అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా జాగ్రత్త వహించాలి. కొత్తగా ఓటు హక్కు పొందే యువత మరియు వివరాల సవరణలు చేసుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ఓటు నమోదు అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులను గానీ, కాంగ్రెస్ నాయకులను గానీ సంప్రదించి సమాచార పత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నీట్ అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

**కొండాపూర్ భారత రాష్ట్ర సమితి నాయకులు ఎండీ అలావుద్దీన్ పటేల్ డిమాండ్**





**కొండాపూర్,జులై 24 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** దేశంలో నాణ్యమైన విద్య, నిష్పక్షపాతమైన పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కొండాపూర్ డివిజన్ భారత రాష్ట్ర సమితి కార్పొరేటర్ ఆశావహులు ఎండీ అలావుద్దీన్ పటేల్ (బీఏ, ఎల్ఎల్బీ) తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వైద్య విద్య ప్రవేశ పరీక్ష (నీట్) ప్రశ్నాపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఇటీవల ఇందిరా పార్క్ సమీపంలో తమ బృందంతో కలిసి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ నిరసన తెలిపినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ పోరాటంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నా కూడా పాల్గొని విద్యార్థుల తరఫున గళం విప్పడం సంతోషకరమన్నారు. ఈ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని పార్టీ మరియు కొండాపూర్ డివిజన్ నివాసుల తరఫున డిమాండ్ చేశారు. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థులు, నాయకులందరూ సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు.

# నల్లగండ్లలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు




**శేరిలింగంపల్లి,జులై 24 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి ఎం.ఈరన్న)** నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాగం హరి శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**వేడుకల ముఖ్యాంశాలు:**

కేక్ కటింగ్: హరి శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కార్మికులకు సత్కారం: నిరంతరం ప్రజాసేవలో శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి, వారిని ఘనంగా సత్కరించారు. నినాదాలు: కేటీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా నినాదాలు చేశారు.

**పాల్గొన్న నాయకులు కార్యకర్తలు:**

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోవింద్, గద్దర్ రాజ్, రాజు ముదిరాజ్, వెంకట్ రెడ్డి, భీమ్ రాజ్, రాణి, పరమేష్, బాలరాజ్, రవికుమార్, నవాజ్, శ్రీకాంత్, సురేష్, నర్సింహ, ఎం. తిరుపతి, చందన్, సాంబ, అరుణ్, శ్రీను, రాము, నర్సింహ, రమేష్, తరుణ్, గోవర్ధన్, మోహన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీలపై భగ్గుమన్న నిరసన..

**ఇందిరా పార్క్ ధర్నాకు పటాన్‌చెరు నుంచి భారీ ర్యాలీ**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

బీఆర్ఎస్ ఇంచార్జ్ ఆదర్శ రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లిన శ్రేణులు

పటాన్‌చెరు,**జులై 24 .అక్షర టైమ్స్ :** (ప్రతినిధి ఎం.వీరేష్) దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ ప్రశ్నపత్రాల లీకేజీల వ్యవహారంపై విద్యార్థులు చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్





కేటీఆర్ పిలుపు మేరకు, హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి భారీ ర్యాలీ బయలుదేరింది. పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఈ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మరియు పరీక్షల నిర్వహణా సంస్థల వైఫల్యం వల్ల వరుసగా నీట్ పేపర్లు లీకై లక్షలాది మంది విద్యార్థుల ఉసురు పోసుకుంటున్నాయని




ప్రస్థాయిలో మండిపడ్డారు. కష్టపడి చదివే ప్రతిభావంతులైన పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును వారు తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన విద్యార్థులకు తగిన న్యాయం చేసేవరకు బీఆర్ఎస్ పార్టీ విద్యార్థుల పక్షాన నిలబడి అలుపెరుగని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ధర్నాను విజయవంతం చేశారు.

# ప్రతి అర్హుడి పేరు ఓటర్ జాబితాలో ఉండాలి: విట్టల్ నాయక్

కాప్రా,**జులై 24 .అక్షర టైమ్స్ :** (ప్రతినిధి గోపగాని పాండు) ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాప్రా 14వ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్లు 5, 8 వద్ద జరుగుతున్న ఫారాల పంపిణీ, సేకరణ, నమోదు ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో మాట్లాడిన విట్టల్ నాయక్, ఎన్నికల వ్యవస్థకు ఓటరు జాబితానే మూలాధారమని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు జాబితాలో నమోదు కావడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఏ ఒక్క అర్హుడూ ఓటరు జాబితా నుంచి మినహాయించబడకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తున్న బూత్ స్థాయి అధికారులు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఫారాలు నింపే సమయంలో పేరు, తల్లిదండ్రుల వివరాలు, చిరునామా, వయస్సు, ఇతర వ్యక్తిగత సమాచారం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. చిన్నచిన్న పొరపాట్లు కూడా భవిష్యత్తులో ఓటు హక్కు వినియోగానికి ఆటంకంగా మారే అవకాశం ఉన్నందున ప్రతి నమోదు ప్రక్రియలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కొత్తగా ఓటరు అర్హత పొందిన



యువత తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, చిరునామా మారిన వారు, వివరాల్లో మార్పులు ఉన్న వారు సంబంధిత ఫారాలను సమర్పించి సవరణలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు ఎన్నికల సిబ్బందికి పూర్తి సహకారం అందించి ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ కార్యక్రమం వేగవంతంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతున్న తీరును పరిశీలించిన విట్టల్ నాయక్, అవసరమైన చోట అధికారులకు సూచనలు చేస్తూ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రతి ఇంటిని సందర్శించి ఫారాలు అందించడం, అర్హుల వివరాలను నమోదు చేయడం, సకాలంలో వాటిని పరిశీలించి ఎన్నికల అధికారులకు అందజేయడం వంటి అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని స్పష్టం



చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు కోబారి నోరి నాగసాషు, బూత్ స్థాయి అధికారి ప్రమీల, కుమార్, బూత్ స్థాయి ప్రతినిధి విట్టల్ నాయక్ తదితరులు పాల్గొని ఫారాల సేకరణ ప్రక్రియను పరిశీలించారు. ప్రజలకు అవసరమైన సూచనలు చేస్తూ, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా సమిష్టిగా కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, ఆ హక్కును పరిరక్షించేందుకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని ఈ సందర్భంగా విట్టల్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

# 400 ఏళ్ల చరిత్రకు నిర్లక్ష్యపు నీడ..

**అభివృద్ధికి నోచుకోని పాదలకూరు**

**శ్రీ పెరుమాళ్ల స్వామి దేవస్థానం**

**మురుగునీటితో నిండిన పురాతన కోనేరు**

**ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయ వైభవం**

**పునరుద్ధరించాలని భక్తుల విజ్ఞప్తి**

పొదలకూరు,**జులై 24 .అక్షర టైమ్స్ :** (రిపోర్టర్ ఆనంద్) పొదలకూరు పట్టణంలోని మస్తాన్‌రెడ్డి నగర్‌లో వెలసి ఉన్న రజకుల ఆరాధ్య దైవం శ్రీ పెరుమాళ్ల స్వామి దేవస్థానం శతాబ్దాల చరిత్రను సొంతం చేసుకున్నప్పటికీ, ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోని దుస్థితిలో ఉంది. సుమారు 400 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని చోళుల కాలంలో నిర్మించినట్లు స్థానిక పెద్దలు, పూర్వీకుల నుంచి అందిన సమాచారం ద్వారా తెలుస్తోంది. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయాన్ని పరిరక్షించి అభివృద్ధి చేయాలని స్థానికులు, భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**చరిత్రను చాటే పురాతన దేవాలయం**

స్థానికుల కథనం ప్రకారం, ఒకప్పుడు శ్రీ పెరుమాళ్ల స్వామి ఆలయంలో నిత్యపూజలు, ప్రత్యేక ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేవారు. ఆ కాలంలో రాజులు సైతం ఈ ఆలయాన్ని సందర్శించి విశ్రాంతి తీసుకునేవారని, ఆలయానికి ఆనుకుని ఉన్న పురాతన కోనేరులో తమ గుర్రాలకు నీరు తాగించేవారని పెద్దలు చెబుతున్నారు. దీంతో ఈ ఆలయం కేవలం ఆధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా చారిత్రక వారసత్వానికి కూడా ప్రతీకగా నిలిచిందని పేర్కొంటున్నారు.

**మురుగునీటితో నిండిన కోనేరు.. దుర్వాసనతో భక్తులకు ఇబ్బందులు**



కాలక్రమేణా ఆలయం అభివృద్ధికి దూరమై నిర్లక్ష్యానికి గురైంది. ముఖ్యంగా ఆలయానికి ఆనుకుని ఉన్న పురాతన కోనేరు పూర్తిగా మురుగు నీటితో నిండిపోయి, ముళ్లకంపలు, కలుపు మొక్కలతో ఆక్రమితమై దుర్వాసన వెదజల్లుతోంది. కోనేరును శుభ్రపరిచే చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆలయ పరిసరాలు కూడా పరిశుభ్రంగా లేకపోవడం వల్ల ఆలయ వైభవం మసకబారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సౌకర్యాల లేమితో తగ్గుతున్న భక్తుల రాక**

ఆలయ ప్రాంగణంలో తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ప్రహరీ, విద్యుత్ వెలుగులు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో భక్తుల రాక తగ్గుతోందని స్థానికులు తెలిపారు.

**రజకుల ఆధ్వర్యంలో నిత్యపూజలు**



ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రస్తుతం రజక సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో నిత్యపూజలు నిరంతరం కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుంటున్నారు.

**ప్రత్యేక నిధులతో పునరుద్ధరణ చేపట్టాలి**

చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి కోనేరును పునరుద్ధరించడం, ఆలయ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఈ పురాతన దేవాలయ వైభవాన్ని తిరిగి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ పెరుమాళ్ల స్వామి దేవస్థానం తన పూర్వ వైభవాన్ని తిరిగి సంతరించుకోవాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

## గోదా నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన ప్రీ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న

**పటాన్చెరువు మాజీ సభ్యుడు మెట్టు కుమార్ యాదవ్**

**శేరిలింగంపల్లి మాజీ సభ్యుడు రాగం నాగేందర్ యాదవ్**





పటాన్చెరు,**జులై 24 .అక్షర టైమ్స్ :** (ప్రతినిధి ఎం.వీరేష్) శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని డోయన్స్ కాలనీలో గోదా నరేందర్ యాదవ్ గోదా గ్రూప్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఐ కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభోత్సవంలో పటాన్చెరు మాజీ సభ్యుడు మెట్టు కుమార్ యాదవ్, శేర్లింగంపల్లి మాజీ సభ్యుడు రాగం నాగేందర్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ నరేందర్ యాదవ్ కు మరియు గోదా గ్రూప్ వారికి నూతన ప్లే స్కూల్ ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోదా నరేందర్ యాదవ్, ఐలాపూర్ మాణిక్ యాదవ్, రవీంద్ర చారి, సతీష్, కర్నే లక్ష్మయ్య, అజ్మత్ అజ్జు, సాయిచరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పొదలకూరులో తాళం వేసిన ఇంట్లో చోరీ..

**రూ.27 వేల విలువైన గృహోపకరణాలు అపహరణ**





పొదలకూరు,**జులై 24 .అక్షర టైమ్స్ :** -(రిపోర్టర్ ఆనంద్) పొదలకూరు పట్టణంలోని బాలాజీనగర్‌లోని నాలుగవ వీధిలో ఓ తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడు పి వేణుగోపాల్ శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు వేణుగోపాల్ ఫిర్యాదులో పేర్కొన్న కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పొదలకూరు బాలాజీనగర్ 4వ వీధిలోని తన సొంత ఇంటికి సుమారు పది నెలలుగా తాళం వేసి ఉంది. ప్రస్తుతం ఆయన సత్యసాయి జిల్లాలోని మంగళగిరి ప్రాంతంలో సాక్షి పత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. శుక్రవారం స్వగ్రామానికి వచ్చి ఇంటిని పరిశీలించగా, గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న రాగి బాయిలర్, రాగి బిందె, ఇత్తడి గిన్నె, సీలింగ్ ఫ్యాన్లు తదితర వస్తువులను అపహరించినట్లు తెలిపారు. దొంగిలించబడిన వస్తువుల విలువ సుమారు రూ.27 వేల వరకు ఉంటుందని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై స్పందించిన పొదలకూరు పోలీసులు కేసు నమోదు చేసి, చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

## జగన్నాథుని సన్నిధిలో నెమలి అనిల్ కుమార్ దంపతులు

**ప్రత్యేక పూజలు,భజనలు, అన్నప్రసాద వితరణలో పాల్గొన్న దంపతులు**





కాప్రా,**జులై 24 .అక్షర టైమ్స్ :** (ప్రతినిధి గోపగాని పాండు) మల్లాపూర్ డివిజన్ అన్నపూర్ణ కాలనీలోని పంచముఖి హనుమాన్ దేవాలయంలో శ్రీ జగన్నాథ స్వామి, శ్రీ బలభద్రుడు, శ్రీ సుభద్ర అమ్మవార్ల సన్నిధిలో నిర్వహించిన ఆధ్యాత్మిక వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్, లిఖితా దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి దివ్య ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో నిర్వహించిన హారతి, భజనలు, కీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తాయి. నెమలి అనిల్ కుమార్ దంపతులు భక్తులతో కలిసి హారతిలో పాల్గొని, భక్తి గీతాలను ఆలపిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. అనంతరం నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో దంపతులు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు వినమ్రంగా సేవలందించడం ద్వారా మానవ సేవే మాధవ సేవ అనే భావనను చాటిచెప్పారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, శ్రీ జగన్నాథ స్వామివారి దివ్య కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆధ్యాత్మికత, సేవాభావం పెంపొందించేందుకు ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక వేడుకలను విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులను నెమలి అనిల్ కుమార్ దంపతులు అభినందించారు. భక్తులందరిపై శ్రీ జగన్నాథ స్వామివారి దివ్య అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని వారు ప్రార్థించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## బీరంగూడ నుండి ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌కు బీఆర్ఎస్వీ భారీ బైక్ ర్యాలీ

**నందారం నరసింహ గౌడు నాయకత్వంలో ఘన విజయం**





బీరంగూడ**జులై 24 .అక్షర టైమ్స్ :** (ప్రతినిధి ఎం.వీరేష్) హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాకు బీరంగూడ డివిజన్ నుండి అమీన్పూర్ మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షులు నందారం నరసింహ గౌడు ప్రత్యేక వ్యూహంతో, భారీ జనసందోహంతో కదిలి వెళ్లారు. ఆయన నాయకత్వంలో వందలాది వాహనాలతో సాగిన ఈ ర్యాలీ ధర్నా ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పటాన్చెరు నియోజకవర్గ ప్రజానాయకులు, శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆశీసులు మరియు ప్రత్యక్ష ఆదేశాల మేరకు నందారం నరసింహ గౌడు ఈ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేశారు. బీరంగూడ నుండి ఇందిరా పార్క్ వరకు సుమారు నాలుగు వందల నుండి ఐదు వందల మందికి పైగా యువకులు, విద్యార్థి విభాగం కార్యకర్తలు కార్లు, ద్విచక్ర వాహనాలతో భారీ కాన్వాయ్‌గా కదిలి ప్రభుత్వానికి తమ నిరసన గళాన్ని గట్టిగా వినిపించారు. ఈ భారీ బైక్ ర్యాలీలో అడుగడుగునా నాయకులు నందారం నరసింహ గౌడు నాయకత్వ ప్రతిభ స్పష్టంగా కనిపించింది. కార్యకర్తలను సమన్వయం చేస్తూ, స్వయంగా ముందుండి నడిపించిన ఆయన స్థానిక యువతలో నూతనోత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడు మాట్లాడుతూ, శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి వెన్నంటి ఉంటూ, విద్యార్థి, యువజన సంక్షేమం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం గులాబీ శ్రేణులు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. నందారం నరసింహ గౌడు చేపట్టిన ఈ భారీ శక్తి ప్రదర్శన పటాన్చెరు రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన యువ నాయకులు తుమ్మల రుశ్వంత్ రెడ్డి





అమీన్పూర్**జులై 24 .అక్షర టైమ్స్ :** (ప్రతినిధి ఎం.వీరేష్) అమీన్పూర్ డివిజన్ పరిధిలోని మహిమ మినిస్ట్రీస్ అనాథ ఆశ్రమంలో భారత రాష్ట్ర సమితి యువ నాయకులు తుమ్మల రుశ్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో, మాజీ మంత్రివర్యులు, సిరిసిల్ల శాసనసభ్యులు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి, కేటీఆర్ గారికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, యువతకు కేటీఆర్ అందించిన స్ఫూర్తిని ఈ వేడుకల సందర్భంగా వక్తలు కొనియాడారు. అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసి కేటీఆర్ జన్మదిన వేడుకలు జరపడం ఎంతో సంతోషకరమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు తుమ్మల దేవేందర్ రెడ్డి, ఆర్కల నిఖిల్ రెడ్డి, జయసూర్య, మహేష్, బోయిని సందీప్, బశెట్టి నాని, కొల్లూరి హేమంత్ తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## పటాన్‌చెరులో కేటీఆర్ జన్మదిన వేడుకలు..

**ప్రతిభావంతులైన విద్యార్థులకు బి ఆర్ ఎస్ పార్టీ ఇన్చార్జి ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు**





పటాన్‌చెరు**జులై 24 .అక్షర టైమ్స్ :** (ప్రతినిధి ఎం.వీరేష్) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గంలో "గిఫ్ట్ ఎ స్మైల్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో వారి నివాసంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సఫాన్ దేవ్ విచ్చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గీత భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 95 శాతానికి పైగా మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు, ద్వితీయ సంవత్సరంలో 95 శాతానికి పైగా మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు. అదేవిధంగా, ఇదే కళాశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ కవే ఢిల్లీ యూనివర్సిటీలో బి.ఏ. ఆనర్స్ కోర్సులో సీటు సాధించినప్పటికీ, హాస్టల్ ఫీజు కట్టే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆదర్శ్ రెడ్డి ఆమె ఉన్నత చదువుల కోసం హాస్టల్ ఫీజు నిమిత్తం అరవై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది మెగా పి.టి. ఎం-4.0

**విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమ్మేళనం ప్రభుత్వ లక్ష్యం**

**పిల్లలను ప్రేమించి బోధించే ఉపాధ్యాయులు అవసరం**

**విధేయత విద్యార్థులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుంది**

**విశ్రాంత ప్రొఫెసర్ డా"కృష్ణ ప్రసాద్ బాబు**

**కావలిజులై 24 .అక్షర టైమ్స్ :** విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ఈ మెగా పి.టి.యం - 4.0 కార్యక్రమం అని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమ్మేళనంతో విద్యార్థుల భవిష్యత్తు ఉన్నత స్థాయిలో నిలపవచ్చు అని, ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ఈ ప్రోగ్రాం సృష్టించడం జరిగిందని విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కావలి పట్టణం జనతాపేటలో ఉన్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల నందు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి.టి.యం 4.0 కార్యక్రమం ప్రిన్సిపల్ నరేంద్ర శ్యామ్ సుధాకర్, ఎస్.యం.సి చైర్మన్ బి మీనాక్షి ల ఆధ్వర్యంలో అద్భుతంగా చేపట్టారు. సభాధ్యక్షులు, ప్రిన్సిపాల్ శ్యామ్ సుధాకర్ తమ పాఠశాల హెచ్ఎం రిపోర్ట్ ను తెలియజేశారు. 2016లో ఈ పాఠశాల గురుకుల పాఠశాలగా అతి స్వల్ప సంఖ్యలో విద్యార్థులతో ప్రారంభించి నేడు 170 మంది విద్యార్థులుగా మారింది అన్నారు. తమ గురుకుల పాఠశాలకు 5 ఎకరాముల భూమి కావాలని ప్రభుత్వానికి ఆర్డీవో ద్వారా వినతితో, విన్నవించాము అన్నారు. గత 10వ తరగతి లో 95.65శాతం ఉత్తీర్ణతతో, వి వెంకట కిషోర్ అనే విద్యార్థి ఐ.టి.డి.ఏ పాఠశాలల్లో 4 జిల్లాలకు గాను మొదటి ర్యాంక్ సాధించారని, మరో ఇద్దరు త్రిబుల్ ఐటీ లో సీట్లు సాధించినట్లు తెలిపారు. గణిత పరీక్షలో నూటికి నూరు మార్కులు తమ పాఠశాల నుంచి సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ బాబు, స్థానిక ప్రజా ప్రతినిధి జి వెంకటేశ్వర్లు నాయుడు, పాఠశాల కో.ఆప్షన్ సభ్యులు, సోషల్ వర్కర్ సుబ్బారావు లు పాల్గొని మాట్లాడారు. ముందుగా ప్రజా ప్రతినిధి వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు అతీతంగా ప్రభుత్వ




పాఠశాలలు, హాస్టల్స్ విద్యార్థులకు మెరుగైన సేవలను ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. కో ఆప్షన్ సభ్యులు సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను పాఠశాలల్లో ప్రభుత్వ ప్రతినిధులుగా ఉన్న ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపుతూ నిస్వార్థ అంకితభావంతో కూడిన విద్యను ఉపాధ్యాయుల ద్వారా అందిస్తూ ఉండటం సంతోషంగా ఉందన్నారు. సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ ప్రసాద్ బాబు మాట్లాడుతూ పేరెంట్స్, టీచర్స్, విద్యార్థులతో మీటింగ్ ఏర్పాటు ఒక గొప్ప విజయాన్ని తెచ్చిపెడుతుంది అన్నారు. ఈ ముగ్గురు ఎవరు చేయవలసిన బాధ్యత వారు చేస్తూ పోతే, నాలుగవదిగా ప్రభుత్వం మనకు కనిపించకుండా ప్రిన్సిపల్ రూపంలో పనిచేస్తూ ఉంటుందన్నారు. పిల్లలు ఒక భవనానికి పిల్లర్స్ లాంటి వారని, భీమ్స్ ఉపాధ్యాయులు అని, తల్లిదండ్రులు, ప్రభుత్వం ఆ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తుంది అన్నారు. పేరెంట్స్, టీచర్లు, విద్యార్థులు అనే ముగ్గురు కలిసి తీసుకునే నిర్ణయంతో ఒక భాంధవ్యమే ఏర్పడుతుంది అన్నారు. ఆ బాంధవ్యం ప్రభుత్వానికి, ఇటు కుటుంబ వ్యవస్థకు మచ్చలేని, క్రమశిక్షణతో కూడిన అభివృద్ధిని తెచ్చిపెడుతున్నారు. తెలివితో కూడిన చదువు కంటే, కష్టపడి చదివినపుడే ఉన్నత స్థానాల్లో స్థిరంగా నిలుస్తారు అన్నారు. ఉపాధ్యాయుల బోధన పట్ల శ్రద్ధతో విని, నెమరు వేస్తూ అన్వయించుకునే విధానంను విద్యార్థులు అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు వారి పిల్లలను శ్రద్ధగా





చదివించాలని, మీ పిల్లలకు చదువు చెప్పే ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే ఉపాధ్యాయులు లాంటి వారు ఏ ప్రైవేటు పాఠశాలల్లో ఉండరు అని గుర్తించి సంతోషించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఆయా ఆటలలో పాల్గొని బహుమతులు పొందారు. అలాగే తల్లి దండ్రుల పాదాలపై విద్యార్థుల చేత పూలు వేయించి పాదాభివందనం చేయించే మంచి కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ టి రవి, తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం మంత్రి పొంగూరి నారాయణ

**నెల్లూరు,జులై 24 .అక్షర టైమ్స్ :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగరంలోని డీఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్స్ మీట్ 4.0 లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఆత్మీయంగా మాట్లాడి పిల్లల చదువు, భవిష్యత్తు లక్ష్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హైస్కూల్ ని అద్భుతంగా నిర్మించిన డీఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. కంపెనీ ప్రతినిధి నాగరాజును సన్మానించిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2024 ఎన్నికల సమయంలో వీఆర్ పాఠశాల అభివృద్ధికి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే నిలబెట్టుకుని అంతర్జాతీయ స్థాయిలో పునర్నిర్మించామని చెప్పారు. వీఆర్ పాఠశాలలో చదివిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 15 ప్రభుత్వ పాఠశాలలను దాతల సహకారంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించగా, జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తలతో పాటు ఉన్నతస్థాయిలో ఉన్న తన స్నేహితులు ముందుకు వచ్చారని తెలిపారు. పిల్లల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించిన మంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. పేరెంట్-టీచర్స్ మీటింగ్ ఉద్దేశం విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలను తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని వాటికి అనుగుణంగా ప్రోత్సహించడమేనని వివరించారు. ప్రతి పాఠశాలలో తరగతి గదులతో పాటు విద్యార్థుల ప్రతిభ ,వికాసానికి అవసరమైన 18 రకాల ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చదువుతో పాటు సంగీతం, క్రీడలు తదితర





రంగాల్లో విద్యార్థులకు ఆసక్తి ఉన్న వాటిలో శిక్షణ అందిస్తామని చెప్పారు. తన విద్యార్థి దశను గుర్తు చేసుకున్న మంత్రి, తాను పదో తరగతిలో ఒకసారి విఫలమైనప్పటికీ పట్టుదలతో చదివి తర్వాత ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై, ఎస్వీ యూనివర్సిటీలో ప్రథమ స్థానం సాధించానని తెలిపారు. బాల్యంలో తన గురువు నారాయణమూర్తి మాస్టారు వేసిన బలమైన పునాది తన జీవితాన్ని మార్చిందన్నారు.

తాను చదివిన పాఠశాలలోనే పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, తల్లిదండ్రులు పెద్దగా చదువుకోకపోయినా విద్యపై ఆసక్తి, కృషితో ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు.నెల్లూరు జిల్లాలో పుట్టి పెరిగినందుకు గర్వంగా ఉందన్న మంత్రి, నారాయణ విద్యాసంస్థల్లో దేశవ్యాప్తంగా 6 లక్షల మంది విద్యాభ్యాసం చేయగా, 60 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 23 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నారాయణ గ్రూప్ ఆధ్వర్యంలో ఉచితంగా ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ అందజేస్తామని ప్రకటించారు. తాను విఆర్సీ లో చదివే రోజుల్లో పేదరికం కారణంగా స్కూల్ కి నడిచి వెళ్ళేవాడినని, చాలా కష్టాలు పడ్డానని చెప్పారు. అలాంటి కష్టం ఉండకూడదనే 6 కోట్ల రూపాయల సొంత నిధులతో 10 వేల సైకిళ్లు కొనుగోలు చేశామని,ఈ నెల 27న తొలివిడతలో 7 వేల సైకిళ్లను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేయనున్నామని తెలిపారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు కనీస వసతులు లేక ఎదుర్కొన్న ఇబ్బందులు నేటి పిల్లలు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఫెయిల్ అయ్యారనో, మార్కులు తక్కువ వచ్చాయనో పిల్లలను తల్లితండ్రులు మందలించటం సరికాదన్నారు. సరైన ప్రోత్సాహం గైడెన్స్ ఇచ్చి మార్పు తీసుకు రావాలని సూచించారు. తానే ఏ దేశానికి వెళ్లినా నారాయణ విద్యార్థులు తారసపడతారని వాళ్లని చూస్తే చాలా సంతోషం వేస్తుందన్నారు. ఒక ఉపాధ్యాయుడికి అంతకు మించిన ఆనందం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత,డిఈఓ బాలాజీ రావు, ఎంఈఓ తిరుపాల్, ప్రిన్సిపాల్ పద్మావతి, డివిజన్ టీడీపీ నేతలు అన్నంగి ప్రసాద్, బీజేపీ నేత మిడతల రమేష్, టీచర్స్, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

**నెరవేరనున్న ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం**

**ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియకు వేగంగా అడుగులు**

**ఆగస్టు మూడో వారంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే అవకాశం**

**డిసెంబరు 9న విలీనంపై తుది ప్రకటన చేసేందుకు ప్రభుత్వ కసరత్తు**

**విలీన విధివిధానాల్లో ఎన్నికల్లో గెలిచిన సంఘానికి భాగస్వామ్యం**

**ఏప్రిల్ సమ్మె హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ చర్యలు**

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న చిరకాల వాంఛను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ప్రణాళిక ప్రకారం అన్నీ జరిగితే, తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన డిసెంబరు 9వ తేదీన విలీనంపై తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈలోగా విలీన ప్రక్రియకు సంబంధించిన పూర్తి విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. విలీన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది. ఆగస్టు మూడో వారంలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సంఘాన్ని విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ హామీతో కార్మిక సంఘాలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, డిపోల వారీగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు వంటి 32 డిమాండ్లను యాజమాన్యం ముందుంచారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు చాలా డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చింది. ఇప్పుడు అత్యంత కీలకమైన విలీనం, ఎన్నికల ప్రక్రియలపై దృష్టి సారించింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం, మొదట ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, గెలిచిన సంఘం అభిప్రాయాలను తీసుకుంటారు.

# రాజకీయాల్లోకి అల్లు అర్జున్ అసలు నిజం చెప్పిన మేనేజర్

**బన్నీ రాజకీయ ప్రవేశంపై జోరుగా సాగుతున్న ప్రచారం**

**ఈ వార్తలన్నీ అవాస్తవాలని మేనేజర్ శరత్ చంద్ర నాయుడు స్పష్టీకరణ**

**ప్రస్తుతం అల్లు అర్జున్ దృష్టి పూర్తిగా సినిమాలపైనే ఉందని వెల్లడి**

**రాబోయే పదేళ్ల పాటు సినిమాలతోనే ఆయన షెడ్యూల్ నిండిపోయిందన్న మేనేజర్**

**మామగారి ద్వారా రాజకీయాల్లోకి వస్తారన్నది కేవలం ఊహాగానమేనని కొట్టివేత**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాజకీయ రంగప్రవేశం చేయబోతున్నారంటూ గత కొంతకాలంగా సాగుతున్న ప్రచారానికి ఆయన మేనేజర్ శరత్ చంద్ర నాయుడు ఫుల్ స్టాప్ పెట్టారు. ఈ వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని, కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న నిరాధారమైన ప్రచారమని ఆయన స్పష్టం చేశారు. అల్లు అర్జున్ మామగారు చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండటంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరిన నేపథ్యంలో మేనేజర్ ప్రకటనతో వీటికి తెరపడినట్లయింది. ఈ విషయంపై ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన శరత్ చంద్ర నాయుడు, అల్లు అర్జున్ రాజకీయ ప్రవేశం వార్తలను తీవ్రంగా ఖండించారు. "సోషల్ మీడియాలో ఈ ప్రచారం మొదలైన వెంటనే నేను స్పందించాను. అవన్నీ ఫేక్ న్యూస్ అని చెప్పాను. ప్రస్తుతం అల్లు అర్జున్ భారతదేశంలోనే అత్యంత బిజీగా ఉన్న నటులలో ఒకరు. తన



కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉన్నారు. ఇలాంటి సమయంలో సినిమాలను వదిలి రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఏముంది?" అని ఆయన ప్రశ్నించారు అల్లు అర్జున్ భవిష్యత్ ప్రణాళికల గురించి వివరిస్తూ.. "ప్రస్తుతం ఆయన చేతిలో భారీ పాన్-ఇండియా ప్రాజెక్టులు ఉన్నాయి. రాబోయే పదేళ్ల వరకు ఆయన షెడ్యూల్ సినిమాలతోనే నిండిపోయింది. అలాంటి పరిస్థితుల్లో రాజకీయాల గురించి ఆలోచించే ఆస్కారమే లేదు" అని శరత్ చంద్ర స్పష్టం చేశారు. మామగారి ద్వారా రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారాన్ని కూడా ఆయన కొట్టిపారేశారు. అది కేవలం మీడియా సృష్టిస్తున్న ఊహాగానం మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం అల్లు అర్జున్ తన పూర్తి దృష్టిని సినిమాలపైనే కేంద్రీకరించారని, దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్న పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ స్పష్టతతో ఐకాన్ స్టార్ రాజకీయాల్లోకి వస్తున్నారనే చర్చకు తాత్కాలికంగా ముగింపు పలికినట్లయింది.

## పొదలకూరు ఎంఈఓ గా రమేష్ బాధ్యతల స్వీకరణ

**పొదలకూరు,జులై 23 .అక్షర టైమ్స్ : (రిపోర్టర్ ఆనంద్)** పొదలకూరు మండల నూతన ఎంఈఓ గా పి. రమేష్ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు నూతన ఎంఈఓకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పి. రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి విద్యలో రాణించేలా పాఠశాలల్లో విద్యా వాతావరణాన్ని మరింత మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.మండలంలోని అన్ని పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి బోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను సమీక్షిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.ద



## పొదలకూరులో ఘనంగా మెగా పేరెంట్స్,టీచర్స్ వేడుకలు..

**తల్లులకు విద్యార్థుల పాదపూజ**

**తల్లిదండ్రులు, విద్యార్థులకు పోటీలు,బహుమతుల ప్రదానం**





**పొదలకూరు,జులై 24 .అక్షర టైమ్స్ : -(రిపోర్టర్ ఆనంద్)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ కార్యక్రమం సందర్భంగా పొదలకూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉత్సాహభరితంగా కార్యక్రమాలు నిర్వహించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతిపై చర్చించారు.పొదలకూరులోని డీఎన్ఆర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు బి. శైలజ, పీడీ దేవికల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ తల్లులకు పాదపూజ నిర్వహించి మాతృమూర్తుల పట్ల గౌరవాన్ని చాటారు. ఈ కార్యక్రమం తల్లిదండ్రులను భావోద్వేగానికి గురిచేయగా, పాఠశాల ప్రాంగణం ఆప్యాయతతో నిండిపోయింది. అనంతరం తల్లిదండ్రులకు విద్యార్థుల విద్యా పురోగతి, హాజరు, భవిష్యత్ లక్ష్యాలపై ఉపాధ్యాయులు వివరించారు.అలాగే డీఎన్ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. సురేష్ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొదలకూరు ఎంపీడీవో నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లల చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం పలు వినోదాత్మక, విజ్ఞాన సంబంధిత పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభను ప్రత్యక్షంగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొని మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేశారు. ఈ సమావేశాల ద్వారా పాఠశాల-తల్లిదండ్రుల మధ్య బంధం మరింత బలోపేతమై, విద్యార్థుల విద్యాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలనే సందేశం అందిందని నిర్వాహకులు తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రభుత్వ లక్ష్యం

**మెగా పి.టి. ఎం - 4.0 లో వక్తలు**

**కావలి/రూరల్,జులై 24 .అక్షర టైమ్స్ :** విద్యార్థుల భవిష్యత్ కు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని వక్తలు మాట్లాడుతూ. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా టి.పి.యం 4.0 కార్యక్రమం కావలి రూరల్ మండలంలోని సర్వాయపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తోట వెంకటేశ్వర్లు, తదితర వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత ఆశయముతో బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధికై ఈ మెగా పి.టి.యం. నిర్వహించడం జరుగుతుందని, తద్వారా తల్లిదండ్రులు తమ బిడ్డల విద్యాభివృద్ధిని ప్రత్యక్షంగా ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకునే అవకాశాన్ని కలిగిస్తుందని, అదేవిధంగా పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, తల్లిదండ్రులు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనాన్ని ఆస్వాదిస్తారని తెలియజేశారు. తదుపరి తమ పాఠశాల ప్రగతి గురించి మాట్లాడుతూ 2023- 24 విద్యా సంవత్సరంలో నలుగురు విద్యార్థులు 'త్రిబుల్ ఐటి' సాధించారని 2024-25 విద్యా సంవత్సరంలో ఒక విద్యార్థి, అదేవిధంగా 2025-2026 విద్యా సంవత్సరంలో ఒక విద్యార్థి త్రిబుల్ ఐటి సాధించారని, అదేవిధంగా 2025-2026 విద్యా సంవత్సరంలో నలుగురు ఎన్.యం.యం.ఎస్ స్కాలర్షిప్ కు సెలెక్ట్ అయ్యారని తెలియజేశారు. చివరిగా తల్లిదండ్రులకు 'మ్యూజికల్ చైర్స్' టగ్ అఫ్ వార్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నరమాల మాధవ, ఉపాధ్యాయులు, దాతలు, తల్లిదండ్రులు, విద్యార్థులు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## పునాది నుంచే విద్యార్థుల్లో సత్ప్రవర్తన రావాలి

**కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి**

**ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు, గ్రామస్తులు**





**కావలి,జులై 24 .అక్షర టైమ్స్ :** పునాది నుంచే విద్యార్థుల్లో సత్ప్రవర్తన రావాలి అని కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సత్ప్రవర్తన, మంచి విలువలు అలవరచుకొని సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ 4.0' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కావలి రూరల్ మండలం, అన్నగారిపాలెం పంచాయతీ పరిధిలోని ఒట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ఒట్టూరు మోడల్ స్కూల్లో నిర్వహించిన సమావేశాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, విలువల ఆధారిత నృత్య ప్రదర్శనలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి విద్యా అభివృద్ధిపై చర్చించే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టడం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యా రంగంలో అనేక వినూత్న సంస్కరణలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.9100900931

# ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా బరువు తగ్గడంలేదా.. తేనెను ఇలా వాడితే.. ఈజీగా తగ్గిపోతారు..!







మారిన ఆహారపు అలవాట్లు, అస్తవ్యస్థమైన జీవనశైలి కారణంగా ఈ మధ్య కాలంలో చాలా మంది అధిక బరువు, ఊబకాయం సమస్యతో బాధపడుతున్నారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్ల కారణంగానే ఎక్కువ మంది అధిక బరువు, బెల్లీ ఫ్యాట్ సమస్యలను ఎదుర్కొవాల్సి వస్తుంది. అయితే, బరువు తగ్గడానికి చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఆహారంలో మార్పులు చేసుకుంటే.. మరికొందరు ఎక్సర్ సైజులు, జిమ్‌ల చుట్టూ తిరుగుతున్నారు. అయితే, చాలా మందిలో ఎక్కువ మార్పు కనిపించడం లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా బరువు తగ్గలేకపోతున్నారు. అలాంటి వారికి కొన్ని ఇంటి చిట్కాలు అద్భుత మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలనే ప్రయత్నంలో ఉన్నవారు తేనె తీసుకోవడం వల్ల బరువు ఈజీగా తగ్గుతారని అంటున్నారు. అదేలాగో ఇక్కడ తెలుసుకుందాం...

తేనెలో విటమిన్స్, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. బరువుని కంట్రోల్ చేసుకోవాలనుకునే వారికి ప్రాసెస్డ్ షుగర్ కంటే తేనె బెస్ట్ ఆప్షన్ అంటున్నారు ఆరోగ్య నిపుణులు. తేనెలోని గుణాలు శరీరానికి చాలా మంచివి. నీరసంగా ఉన్నప్పుడు ఒక టీ స్పూన్ తేనె తింటే చాలు సమస్య ఇట్టే తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారను. అందుకకు దీనిని నేచురల్ ఎనర్జీ బూస్టర్ అంటారు.

తేనెని తీసుకుంటే మెటబాలిజం పెరుగుతుంది. దీని వల్ల జీర్ణశక్తి సరిగ్గా పెరిగి మనం తీసుకున్న ఆహారాన్ని బాడీ సరిగ్గా అబ్జార్బ్ చేసుకుంటుంది. దీంతో పోషకాలు అందుతాయి. బరువు కూడా తగ్గుతారు. తేనె తీసుకోవడం వల్ల అధిక క్యాలరీలు కలిగిన స్వీట్లపై కోరికలు తగ్గుతాయి. తేనెలో ఉండే కార్బోహైడ్రేట్లు త్వరిత శక్తిని అందజేస్తాయి.

ప్రతిరోజూ గోరు వెచ్చని నీటిలో తేనె వేసుకోవాలి. జీవక్రియను మెరుగ్గా చేసేందుకు తేనెని ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో కలిపి తీసుకోవచ్చు. దీనిని తీసుకోవడం వల్ల ఆకలి, ఎక్కువగా తినాలన్న కోరికలను తగ్గిస్తుంది. ఇది కేలరీలు తీసుకోకుండా చూస్తుంది.

తేనె తీసుకుంటే జీర్ణ వ్యవస్థ క్లీన్ అవుతుంది. ఇది నేచురల్ ప్రోబయోటిక్‌గా పనిచేస్తుంది. దీంతో బాడీ నుండి టాక్సిన్స్ బయటికెళ్ళిపోతాయి. దీంతో బరువు తగ్గడమే కాదు.. మన బాడీలో వ్యాధికారకాలన్నీ బయటికి వెళ్తాయి. ప్రతిరోజూ గోరు వెచ్చని నీటిలో తేనె వేసుకుని తీసుకోవటం వల్ల బరువు తగ్గుతారు.

తేనె తీసుకోవడం వల్ల జీర్ణ ఆరోగ్యానికి కూడా మంచిది. తిన్న తర్వాత గోరువెచ్చని నీటిలో నిమ్మరసం, తేనె వేసుకుని తీసుకోవటం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం, ఒక గ్లాసు గోరు వెచ్చని పాలలో తేనెను కలిపి తీసుకోవటం వల్ల వేగంగా బరువు తగ్గడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

# తెలుగింటి వంటకాలతో 35 కిలోల్ర బరువు తగ్గిన కుర్రోడు.. వీడియో చూశారా?

నేడు జీవితం ఒక దిశలో కదులుతుంటే, శరీరం మరో దిశలో కదులుతోంది. ఈ ఒత్తిడితో కూడిన జీవితంలో శరీర ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను జాగ్రత్తగా చూసుకోవడం అంత సులువుకాదు. ఈ రెండింటినీ సమతుల్యంగా ఉంచడం కష్టమని అనుకునేవారు లేకపోలేదు. కొంత మంది ప్రతిరోజూ గంటల తరబడి కసరత్తులు చేసినా.. నేటి కాలంలో యువత ఎదుర్కొంటున్నఅతి ముఖ్యమైన సమస్యల్లో ఉభకాయం ఒకటి. నేడు జీవితం ఒక దిశలో కదులుతుంటే, శరీరం మరో దిశలో కదులుతోంది. ఈ ఒత్తిడితో కూడిన జీవితంలో శరీర ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను జాగ్రత్తగా చూసుకోవడం అంత సులువుకాదు. ఈ రెండింటినీ సమతుల్యంగా ఉంచడం కష్టమని అనుకునేవారు లేకపోలేదు. కొంత మంది ప్రతిరోజూ గంటల తరబడి కసరత్తులు చేసినా.. ఎంత మాత్రం ప్రయోజనం ఉండదు. ఇలాంటి వారు తమ షెడ్యూల్‌లో కొన్ని మార్పులు చేసుకుంటే తేలికగా బరువు తగ్గొచ్చని ఓ యువకుడు చెబుతున్నాడు. సప్లిమెంట్లు, కఠినమైన ఆహార నియమాలు పాటించకుండానే సహజ పద్ధతుల్లో 35 కిలోగ్రాముల బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఫిట్‌నెస్ బ్లాగర్ %ూ%జితిన్ ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో షేర్ చేశాడు. తాను ఏ విధంగా బరువు తగ్గాడో ఆ వివరాలు ఇందులో నెటిజన్లతో పంచుకున్నాడు. ముఖ్యంగా ప్రోటీన్ అధికంగా ఉండే దక్షిణాది అల్పాహారాలను తీసుకోవడం ద్వారా బరువు తగ్గడం సాధ్యమైందని జితిన్ వివరించాడు. సాధారణంగా ప్రతిరోజూ చేసే వంటలతో తన బరువు తగ్గే రహస్యాన్ని వెల్లడించాడు. అనవసరమైన పద్ధతులను ఉపయోగించకుండా సహజ ఆహారాలను ఉపయోగించడం ద్వారా అతను బరువు తగ్గాడట. ఈ వీడియో జితిన్ ఏడు శాఖాహార ఆహారాలను ప్రస్తావించాడు. రుచికరమైన, సులభంగా తయారు చేయగల వంట పద్ధతులను కూడా ఇందులో ప్రస్తావించాడు. దీని గురించి ఇక్కడ మరింత చూడండి.



### పనీర్ స్టఫ్డ్ గోధుమ దోస

మీరు ప్రతిరోజూ దోస తినే అలవాటు ఉంటే, బియ్యం పిండి దోసకు బదులుగా గోధుమ దోస తయారు చేసుకోండి. పనీర్ మసాలా, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కొత్తిమీర వేసి చట్నీ తయారు చేసుకుని, గోధుమ దోసతో దీన్ని తింటే, భలే రుచిగా ఉంటుంది. శరీరానికి కూడా మంచిది. ఇది దాదాపు 18 గ్రాముల ప్రోటీన్, 300 కేలరీలను అందిస్తుంది. బరువు తగ్గేటప్పుడు కండరాలు బాధపడకుండా కూడా ఇది నివారిస్తుంది.

### గుడ్డు మసాలాతో రాగి రోటీ

ఈ వంటకం మాంసాహారులకు మంచిది. ఉల్లిపాయ, టమోటా, గుడ్డు మసాలాతో రెండు ఉడికించిన గుడ్లు వేసి తయారు చేసుకోవాలి. అలాగే రాగి, బజ్రా లేదా జోవర్‌తో తయారు చేసిన రాగి రోటీ కూడా ఆరోగ్యానికి మంచిది. ఇందులో 18 గ్రాముల ప్రోటీన్, 230 కేలరీలు మాత్రమే ఉంటాయి. రాగిలోని అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణ ప్రయోజనాలను పెంచుతుంది.

### శనగ పిండి దోస విత్ పుదీనా చట్నీ

శనగ పిండి (బేసన్) తో తయారుచేసిన క్రిస్పీ దోస రుచికరమైన అల్పాహారం. అల్లం, పచ్చిమిర్చి, కొత్తిమీరను పిండిలో కలిపి తయారు చేసుకోవాలి. పెరుగుతో చేసిన పుదీనా చట్నీ శనగపిండి దోసతో కలిపి తినవచ్చు. ఇందులో 12 గ్రాముల ప్రోటీన్, 240 కేలరీలు ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది.

# అన్ని రోగాలకు ఒక్కటే మందు.. 30 రోజులు తాగి చూడండి.. ఆ తర్వాత




బాడీలో మెటబాలిజం పెరుగుతుంది. దీంతో మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ జ్యూస్ తాగడం వల్ల చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఈ జ్యూస్‌లో ఉండే విటమిన్లు, మినరల్స్ చర్మం సాగే గుణాన్ని ప్రోత్సహిస్తాయి. దీంతో వయస్సు మీద పడడం వల్ల వచ్చే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. దీంతోపాటు జుట్టు నల్లగా మారుతుంది. క్రమం తప్పకుండా ఏబీసీ జ్యూస్ తాగుతూ ఉండటం వల్ల యవ్వనంగా కనిపిస్తారు. యాపిల్, బీట్ రూట్, క్యారెట్ కలిపి చేసే దాన్నే ఏబీసీ జ్యూస్ అంటారు. ప్రతిరోజూ ఈ జ్యూస్ తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజూ ఏబీసీ జ్యూస్ ను తాగితే రోగ నిరోధక శక్తి స్థాయిలు అమాంతం పెరుగుతాయి. అలాగే శరీరంలో యాంటీ ఆక్సిడెంట్ల నిల్వ పెరుగుతుంది. ఈ మూడింటితో చేసే జ్యూస్ లో యాంటీ-ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ-రాడికల్స్‌తో పోరాడి ఆక్సీకరణ ఒత్తిడిని నియంత్రిస్తాయి. ఈ జ్యూస్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీర్ణ సంబంధ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఏబీసీ జ్యూస్ తీసుకోవటం వల్ల శరీరంలో తెల్ల రక్త కణాలు ఉత్పత్తి కూడా పెరుగుతుంది. రోగ నిరోధక వ్యవస్థ బలపడుతుంది. ఈ జ్యూస్ చర్మానికి ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయి. చర్మానికి సహజమైన రంగును ఇస్తాయి. చర్మంలో ఉన్న టాక్సిన్స్, మురికిని వదిలేస్తాయి. ఫలితంగా చర్మం కాంతివంతంగా మారుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఏబీసీ జ్యూస్ ఎంతో మేలు చేస్తుంది. దీనిలోని ఫైబర్ లక్షణాలు రోజంతా మిమ్మల్ని తక్కువ ఆహారం తినేలా చేస్తాయి. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. ఈ జ్యూస్ తాగడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. తీవ్రమైన అలసట, నీరసం ఉన్నవారు ఈ జ్యూస్‌ను తాగితే శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా మారుతారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. బాడీలో మెటబాలిజం పెరుగుతుంది. దీంతో మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ జ్యూస్ తాగడం వల్ల చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఈ జ్యూస్‌లో ఉండే విటమిన్లు, మినరల్స్ చర్మం సాగే గుణాన్ని ప్రోత్సహిస్తాయి. దీంతో వయస్సు మీద పడడం వల్ల వచ్చే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. దీంతోపాటు జుట్టు నల్లగా మారుతుంది. క్రమం తప్పకుండా ఏబీసీ జ్యూస్ తాగుతూ ఉండటం వల్ల యవ్వనంగా కనిపిస్తారు.

## అలోవీరాతో అద్భుత ప్రయోజనాలు..
# ఈ విషయాలు తప్పక తెలుసుకోండి..



అలోవీరా ఆంత్రాక్వినోన్స్ సమ్మేళనాలను కలిగి ఉంటుంది. ఇవి మలబద్ధకానికి ప్రకృతి ఔషధంగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలోవీరాతో మీ జుట్టు మెరుస్తూ, స్మూత్‌గా మారిపోతుంది. జుట్టు రాలిపోయేవారు ఇలా చేయడం వల్ల మంచి ఫలితాలుంటాయి. కడుపులోని కొవ్వు, చెడు పదార్థాలు, పేగులకు అంటుకుపోయే ఆయిల్ వంటివన్నీ మొత్తం క్లీన్ అయిపోతాయి. ఉత్తి జ్యూస్ తాగలేమనుకునేవారు అందులో కాస్త నిమ్మరసం, తేనె లాంటివి కలుపుకుంటే సరి అలోవీరాతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. చర్మ సమస్యలతో పాటు డయాబెటిస్ రోగులకు అలోవీరా అద్భుతంగా పని చేస్తుంది. జిడ్డు చర్మంతో చాలా మంది ఇబ్బందిపడుతుంటారు. ఇలాంటి వారు కలబంద ఆకుని నీళ్లలో కాసేపు మరిగించి దాన్ని పేస్ట్‌లాగా వాడుకోవచ్చు. ఇలాంటి ఫేస్ మాస్క్‌తో మంచి ఫలితం ఉంటుంది. ముఖంలో ట్యాన్ సమస్యకు కూడా అలోవీరాతో చెక్ పెట్టొచ్చు. అలోవీరా గుజ్జును నిమ్మరసం, పసుపు వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంతో ట్యాన్ సమస్య తగ్గుతుంది. అలోవీరాను పచ్చిగా లేదా జ్యూస్ గా కూడా తీసుకోవచ్చు. ఫలితంగా చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంటాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అలోవీరా జ్యూస్ ద్వారా విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. మంచి ఆరోగ్య ఫలితాలు అందుతాయి. కడుపులోని కొవ్వు, చెడు పదార్థాలు, పేగులకు అంటుకుపోయే ఆయిల్ వంటివన్నీ మొత్తం క్లీన్ అయిపోతాయి. ఉత్తి జ్యూస్ తాగలేమనుకునేవారు అందులో కాస్త నిమ్మరసం, తేనె లాంటివి కలుపుకుంటే సరి. గుండె సంబధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంతో పాటు రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలోనూ అలోవీరా జ్యూస్ అద్భుత మేలు చేస్తుంది. అలోవీరా ఆంత్రాక్వినోన్స్ సమ్మేళనాలను కలిగి ఉంటుంది. ఇవి మలబద్ధకానికి ప్రకృతి ఔషధంగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలోవెరా గుజ్జునూ.. కొబ్బరి నూనెతో కలిపి తలకు పట్టిస్తే మంచి మేలు చేస్తుంది. దీంతో జుట్టు రిపేర్ అవుతుంది. చుండ్రు వదిలిపోతుంది. తలలోని మృత కణాలు తొలగిపోతాయి. మీ జుట్టు మెరుస్తూ, స్మూత్‌గా మారిపోతుంది. జుట్టు రాలిపోయేవారు ఇలా చేయడం వల్ల మంచి ఫలితాలుంటాయి. కడుపులోని కొవ్వు, చెడు పదార్థాలు, పేగులకు అంటుకుపోయే ఆయిల్ వంటివన్నీ మొత్తం క్లీన్ అయిపోతాయి. ఉత్తి జ్యూస్ తాగలేమనుకునేవారు అందులో కాస్త నిమ్మరసం, తేనె లాంటివి కలుపుకుంటే సరి

## ప్రెగ్నెన్సీ సమయంలో ప్రయాణిస్తున్నారా?
# ఈ విషయం తప్పక తెలుసుకోండి..



గర్భిణీలు ప్రయాణాల సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే ఈ సమయంలో వారి ఆరోగ్యం చాలా సున్నితంగా ఉంటుంది. గర్భధారణ సమయంలో సాధారణంగానే చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. గర్భిణీలు ఈ సమయంలో తల్లి, బిడ్డ ఆరోగ్యం కోసం చాలా జాగ్రత్తగా ఉండాలని.. మనలో చాలా మందికి ట్రావెలింగ్ చాలా సరదా. అయితే అన్ని సమయాల్లో ఆ అలవాటు ఆనందాన్ని నింపదు. ముఖ్యంగా గర్భిణీలు ప్రయాణాల సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే ఈ సమయంలో వారి ఆరోగ్యం చాలా సున్నితంగా ఉంటుంది. గర్భధారణ సమయంలో సాధారణంగానే చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. గర్భిణీలు ఈ సమయంలో తల్లి, బిడ్డ ఆరోగ్యం కోసం చాలా జాగ్రత్తగా ఉండాలని అందుకే వైద్యులు పదే పదే సూచిస్తుంటారు. అయితే ప్రెగ్నెన్సి సమయంలో ప్రయాణించాలంటే అమ్మాయిలు కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే చిన్న నిర్లక్ష్యం కొన్నిసార్లు తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. అందువల్ల గర్భిణీ సుదీర్ఘ ప్రయాణానికి వెళ్లే ముందు ఈ కింది జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం..

### వైద్యుడిని సంప్రదించాలి

ప్రెగ్నెన్సి సమయంలో అమ్మాయిలు దూర ప్రయాణాలు చేసే ముందు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా వారికి ఏవైనా దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే లేదా రోజూ మందులు వాడుతుంటే.. ఇలాంటి వారు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. తనిఖీ తర్వాత డాక్టర్ మీకు సరైన సలహా ఇస్తారు.

### ఆహారంపై శ్రద్ధ

గర్భిణీలు ప్రయాణాలలో జంక్ ఫుడ్, వేయించిన, కారంగా ఉండే ఆహారాన్ని తినకూడదు. అలాంటి ఆహారాన్ని తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. అందువల్ల ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు శుభ్రమైన నీళ్లు తాగాలి. అలాగే వీలైనంత వరకు కారంగా ఉండే ఆహారాన్ని తినకుండా నిరోధించాలి. ప్రయాణ సమయంలో అలసట చాలా సాధారణం. ముఖ్యంగా గర్భిణీలు సులువుగా అలసి పోతారు. కాబట్టి ఈ సమయంలో విశ్రాంతి తీసుకోవడం చాలా ముఖ్యం. అలాగే తగినంత నిద్ర కూడా అవసరం. అలసట, నిద్ర లేకపోవడం మీ రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది. నిద్ర లేకపోవడం అలసట, ఒత్తిడికి దారితీస్తుంది. కాబట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగినంత విశ్రాంతి తీసుకోవడం చాలా ముఖ్యం.

### సౌకర్యవంతమైన సీట్లను ఎంచుకోవాలి

ప్రయాణ సమయంలో సౌకర్యవంతమైన సీటును ఎంచుకోవాలి. మీరు రైలులో ప్రయాణిస్తుంటే, వాష్‌రూమ్‌కు దగ్గరగా ఉన్న సీటును ఎంచుకోండి. ఎందుకంటే తరచుగా వాష్‌రూమ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. వదులుగా, సౌకర్యవంతమైన దుస్తులు ధరించాలి. ముఖ్యంగా కారులో ప్రయాణిస్తుంటే మాత్రం సీటు బెల్ట్ ధరించడం గుర్తుంచుకోవాలి. అలాగే మీరు వెళ్లే ప్రదేశం వాతావరణం, ఆహారం, తాగునీటి గురించి ముందుగానే క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఎక్కి దిగాల్సిన ప్రదేశాలకు వెళ్లకుండా ఉండటమే మంచిది. మీరు వెళ్లే ప్రదేశం చుట్టుపక్కల ఉన్న ఆసుపత్రులు, వైద్యుల గురించి కూడా సమాచారం ముందే సేకరించాలి. ఒకవేళ ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే ఆ వైద్యుడిని సంప్రదించడంలో ఆలస్యం చేయకూడదు.

### ముఖ్యమైన మందులను వెంట తీసుకెళ్లాలి

గర్భధారణ సమయంలో ప్రయాణించేటప్పుడు మందులను ఎల్లప్పుడూ మీతో తీసుకెళ్లాలి. దీన్ని నిర్లక్ష్యం చేయవద్దు. ప్రయాణ తేదీకి కొన్ని రోజుల ముందే వైద్యుడిని సందర్శించి, మీకు ఏదైనా సమస్య ఉంటే అతనికి తెలియజేయాలి. తద్వారా వైద్యులు మీకు అవసరమైన మందులను అందిస్తారు. ఈ కంటెంట్ సాధారణ సమాచారాన్ని మాత్రమే అందిస్తుంది. మరింత సమాచారం కోసం వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## డయాబెటిస్ రోగులకు దివ్యౌషధం..
## షుగర్‌ను కూకటివేళ్ల నుండి నయం చేసే దివ్యాస్త్రం..!



మెగ్నీషియం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇందులో విటమిన్ బి6 కూడా ఉంటుంది. అరటి పూవ్వు మహిళల్లో రుతుక్రమ సమస్యలను నివారిస్తాయి. ఇందులో ఉండే ఐరన్ ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి హెల్ప్ చేస్తుంది. అరటి పువ్వు తింటే రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని అంటున్నారు..ఇందులో ఉండే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్, ఫైబర్ రక్తంలో షుగర్ కంట్రోల్ చేయడానికి హెల్ప్ అవుతుంది. అరటిపువ్వుతో ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అరటి పువ్వులో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఫైబర్, ప్రోటీన్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం ఉంటాయి. ఎముకలను బలంగా ఉంచడంలో ఇవి సహాయపడతాయి. అరటి పువ్వులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అరటి పువ్వులో విటమిన్లు ఏ సీ పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. సీజనల్ జబ్బులు రాకుండా వ్యాధులను నివారిస్తాయి. దీనిలో ఉండే మెగ్నీషియం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ముఖ్యంగా దీనిలో ఉండే విటమిన్ బి6.. మహిళల్లో రుతుక్రమ సమస్యలను నివారించి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అరటి పువ్వును ఆహారంలో భాగంగా చేసుకోవటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. దీర్ఘకాలిక వ్యాధులు కూడా తగ్గుతాయి. అరటి పువ్వులో మెగ్నీషియం చాలా సమృద్ధిగా ఉంటుంది. మెగ్నీషియం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇందులో విటమిన్ బి6 కూడా ఉంటుంది. అరటి పూవ్వు మహిళల్లో రుతుక్రమ సమస్యలను నివారిస్తాయి. ఇందులో ఉండే ఐరన్ ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి హెల్ప్ చేస్తుంది. అరటి పువ్వు తింటే రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని అంటున్నారు..ఇందులో ఉండే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్, ఫైబర్ రక్తంలో షుగర్ కంట్రోల్ చేయడానికి హెల్ప్ అవుతుంది. అరటి పువ్వులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. నొప్పి, వాపులు, ఆర్థరైటిస్ వంటి సమస్యల్ని ఇవి తొలగిస్తాయి. అరటి పువ్వును తీసుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన, డిప్రెషన్ వంటి బాధలు కూడా ఉండవు. అరటి పువ్వు తీసుకుంటే పాలిచ్చే తల్లుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుంది. బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది.

అక్షర టైమ్స్

# ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓతో కోటీశ్వరులుగా మారిన ఉద్యోగులు

ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓతో ఉద్యోగులు కోటీశ్వరులుగా మారారు. ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లో పని చేస్తున్న 13 మంది ఉద్యోగులు ఒక్కసారిగా కోటీశ్వరులుగా మారారు. వీరికి గతంలో ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ (ఈసాప్) షేర్లు కేటాయించారు. ఈ 13 మంది ఒక్కొక్కరి వద్ద రూ. 1 కోటికి పైగా విలువైన వెస్టెడ్ ఈక్విటీ షేర్లు ఉన్నాయి. వెస్టెడ్ షేర్లు అంటే.. ఇతరులకు ఈ షేర్లను విక్రయించవచ్చు. మంగళవారం ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ షేర్లు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యాయి. ఈ స్టాక్ బీఎస్ఇలో రూ. 610 వద్ద లిస్ట్ అయింది. ఇది దాని ఇష్యూ ధరపై 6.27% ప్రీమియంలో లిస్ట్ కాగా..ఎన్ఎస్ఇలో రూ. 613.30 వద్ద లిస్ట్ కాగా దాదాపు 7శాతం లిస్టింగ్ గెయిన్స్ అందించింది. దీంతో 13 మంది వద్ద ఉన్న షేర్ల విలువ కోట్ల రూపాయలకు పెరిగాయి. డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ దేవిందర్ పాల్ సింగ్ అత్యధికంగా లబ్ధి పొందారు. ఈయన వద్ద 21.14 లక్షల వెస్టెడ్ షేర్లు ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ. 121 కోట్లుగా ఉంది. ఐపీఓ ఇష్యూ ప్రైస్ తో ఇంత విలువ వచ్చింది. షేర్లు ధర పెరిగితే విలువ ఇంకా పెరుగుతోంది. దేవిందర్ పాల్ సింగ్ వద్ద అన్ వెస్టెడ్ షేర్లు కూడా ఉన్నాయి. వీటిని భవిష్యత్తులో వినియోగించుకుంటే దాదాపు రూ. 30 కోట్ల విలువ ఉండవచ్చని చెబుతున్నారు. ఇక్కడ అన్ వెస్టెడ్ షేర్లు అంటే విక్రయించడానికి వీలు లేని షేర్లు. చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసన్ రామ అయ్యర్ వద్ద 18.25 లక్షల వెస్టెడ్ షేర్లు ఉన్నాయి. వీటి విలువ దాదాపు రూ.105 కోట్లుగా ఉంది. ఆయన వద్ద అన్ వెస్టెడ్ షేర్లు




కూడా ఉన్నాయి. భవిష్యత్తో వీటి ద్వారా రూ.51 కోట్లు పొందే అవకాశం ఉంది. చీఫ్ ఆఫ్ స్ట్రాటజీ, డిజిటల్ ఎ టెక్నాలజీ, హెడ్ ఆఫ్ ఇన్వెస్టర్ రిలేషన్స్ శ్రీనివాస్ జైన్ దాదాపు రూ. 59 కోట్ల విలువైన వెస్టెడ్ షేర్లను కలిగి ఉన్నారు. చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్–ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ రాజీవ్ రాధాకృష్ణన్ వద్ద దాదాపు రూ. 36 కోట్ల విలువైన షేర్లు ఉన్నాయి. చీఫ్ రిస్క్ ఆఫీసర్ అపర్ణ నిర్గుడే వద్ద రూ. 31 కోట్ల విలువైన వెస్టెడ్ షేర్లు ఉండగా.. చీఫ్ కంప్లయన్స్ ఆఫీసర్, కంపెనీ సెక్రటరీ మరియు హెడ్ ఆఫ్ లీగల్ వినయ దాతర్ దాదాపు రూ. 21 కోట్ల విలువైన వెస్టెడ్ షేర్లు ఉన్నాయి. వీరితో పాటు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఇందర్‌జీత్ ఘులియాని, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ రజత్ గ్రోవర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ సంజయ్ పుగావ్‌కర్, ఫండ్ మేనేజర్లు మోహన్ లాల్, మహేష్ ఛాబ్రియాలతో సహా పలువురు ఉద్యోగుల వద్ద కోటి రూపాలయల విలువైన షేర్లు ఉన్నాయి. ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ తొలిసారిగా 2018లో ఉద్యోగులకు ఈఎస్‌ఓపి కేటాయిచింది. ఒక్కో షేరుకు సుమారు రూ. 39 నుంచి రూ. 455 వరకు వినియోగ ధరలతో స్టాక్ ఆప్షన్లను మంజూరు చేశారు. ఐపీఓ ధరను రూ. 574గా నిర్ణయించడంతో ఉద్యోగులు గణనీయమైన లాభాలను ఆర్జించారు. ఐపీఓకు ముందు ఎస్‌బీఐ ఫండ్స్, బ్లాక్‌రాక్, గోల్డ్‌మన్ సాక్స్‌తో సహ 129 యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి దాదాపు రూ. 2,663 కోట్లు సమీకరించింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఏసీబీ చరిత్రలోనే బిగ్గెస్ట్ అక్రమాస్తుల రైడ్

## వెంకట రమణ అవినీతి సంపాదన చూస్తే కళ్లుబైర్లు కమ్మాల్సిందే




తెలంగాణ అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ) చరిత్రలోనే అత్యంత భారీ అక్రమాస్తుల కేసు వెలుగు చూసింది. తెలంగాణ పునరుత్పాదక ఇంధనాభివృద్ధి సంస్థ (రెడ్కో) డివిజనల్ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకట రమణ నివాసాలు, కార్యాలయాలు, బంధువుల ఇళ్లు సహా ఏడు ప్రాంతాల్లో ఏసీబీ బుధవారం ఏకకాలంలో దాడులు నిర్వహించి భారీగా నగదు, స్థిరాస్తి పత్రాలను స్వాధీనం చేసుకుంది. ఈ సోదాల్లో లభించిన అక్రమాస్తుల బహిరంగ మార్కెట్ విలువ ఏకంగా రూ. 150 నుంచి రూ. 200 కోట్లు వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ సోదాల సమయంలో ఏసీబీ అధికారులు భారీగా స్థిరాస్తులతో పాటు స్థిరాస్తి వ్యాపారంలో పెట్టిన పెట్టుబడులను కనుగొన్నారు. సెరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఉన్న నాలుగు నివాస ఫ్లాట్‌లతో పాటు కూకట్‌పల్లి, గుట్టల బేగంపేట్‌లలో ఉన్న రెండు భారీ వాణిజ్య భవనాలను గుర్తించారు. అంతేకాకుండా ఆ అధికారి తన భార్య పేరు మీద నాలుగు నిర్మాణ సంస్థలను ఏర్పాటు చేసి రియల్ ఎస్టేట్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. ప్రస్తుతం ఆంజనేయ నగర్, మూసాపేట్‌లలో సుమారు రూ. 20 కోట్ల అంచనా వ్యయంతో 10 నివాస అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయి. ఈ దాడుల్లో స్థిరాస్తులతో పాటు భారీగా చరాస్తులను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రూ. 4 కోట్ల విలువైన 2.094 కిలోల బంగారు ఆభరణాలు, రూ. 52.02 లక్షల బ్యాంకు డిపాజిట్లు, సుమారు రూ. 45 లక్షల విలువైన కియా, మహీంద్రా, మారుతి బలేనో కార్లు, రూ. 30 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ లభ్యమయ్యాయి. వీటితో పాటు ఆయన నివాసంలో దాదాపు రూ. 2.5 లక్షల విలువైన 20 మద్యం సీసాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల డాక్యుమెంట్ల ప్రకారం ప్రభుత్వ అధికారిక విలువ రూ. 27.65 కోట్లుగా ఉన్నప్పటికీ. వీటి ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ రూ. 100 కోట్ల నుండి రూ. 150 కోట్ల మధ్య ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సస్పెండ్ అయిన తహసీల్దార్ అక్రమార్జన రూ. 50 కోట్ల పైమాటే. చంచల్‌గూడ మహిళా జైలులో తుమ్మకొమ్మ సుచరిత.. గతంలో కూడా ఈ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం గమనార్హం. 2019 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో డివిజనల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సమయంలో.. ఒక పని తుది అంచనా ఆమోదం కోసం రూ. 25 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఆ సమయంలో జరిపిన తనిఖీల్లో కూడా రూ. 26.52 లక్షల నగదతో పాటుగా రూ. 22.60 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుతం పట్టుబడిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరిచి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నిందితుడి బినామీ లావాదేవీలు, మిగిలిన పెట్టుబడులపై ఏసీబీ మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తోంది. ఏసీబీ రికార్డుల ప్రకారం ఇప్పటివరకు 2019 నాటి ఈఎస్ఐ మందుల సరఫరా కుంభకోణంలో ఐఎంఎస్ మాజీ డైరెక్టర్ దేవికారాణికి చెందిన రూ. 25.70 కోట్ల అధికారిక విలువైన అక్రమాస్తులే మొదటి స్థానంలో ఉండేవి. అయితే ఇప్పుడు వెంకట రమణ వద్ద లభించిన ఆస్తుల అధికారిక విలువ రూ. 27,65,02,133గా తేలడంతో దేవికారాణి రికార్డును దాటి ఇది ఏసీబీ చరిత్రలోనే అతిపెద్ద కేసుగా నిలిచింది. ఏసీబీ సిటీ రేంజ్–2 డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్ పర్యవేక్షణలో వెంకట రమణపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. స్వాధీనం చేసుకున్న ప్రధాన ఆస్తుల వివరాలు: స్థిరాస్తులు: శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలలో నాలుగు ఫ్లాట్లు (రూ. 1.23 కోట్లు), కూకట్‌పల్లి అంజనేయ నగర్‌లో జీ3 వాణిజ్య భవనం (రూ. 1.82 కోట్లు), గుట్టల బేగంపేట్‌లో జీ5 వాణిజ్య భవనం (రూ. 2.90 కోట్లు). రియల్ ఎస్టేట్ పెట్టుబడులు: తన భార్య పేరిట ఉన్న నాలుగు నిర్మాణ సంస్థల ద్వారా అంజనేయ నగర్, మూసాపేట, కూకట్‌పల్లిలలో నిర్మించిన 10 అపార్ట్‌మెంట్ల ప్రాజెక్టులు (అంచనా వ్యయం రూ. 20 కోట్లు). చరాస్తులు ఎ ఇతరాలు: 2.09 కేజీల బంగారు ఆభరణాలు, రూ. 52.02 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, కియా, మహీంద్రా, బలెనో కార్లు (రూ. 45 లక్షలు), రూ. 30 లక్షల విలువైన ఎలక్ట్రానిక్స్ ఎ గృహోపకరణాలు మరియు రూ. 2.5 లక్షల విలువైన 20 మద్యం సీసాలు. అడ్డదారిలో పోస్టింగ్ ఎ లంచం చరిత్ర: వెంకట రమణ గతంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సైబర్ సిటీ సర్కిల్‌లో డీఈగా పనిచేస్తున్నప్పుడు, డిసెంబర్ 12, 2019న ఓ కాంట్రాక్టర్ వద్ద రూ. 25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. అప్పట్లో దాడులు చేసి రూ. 26.52 లక్షల నగదు, రూ. 22.60 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. జైలు నుండి విడుదలయ్యాక. ఆయన అడ్డదారిలో డిప్యూటేషన్‌పై 'రెడ్కో'లో పోస్టింగ్ సంపాదించి మళ్లీ అవినీతికి పాల్పడినట్లు తేలింది. నిందితుడిని గురువారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు.

# భారత రాజధానిగా విశాఖ నగరం

## బెంగళూరు, ముంబైలకి బిగ్ సవాల్ , తాజా న్యూస్ ఏంటంటే

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా వెలుగొందుతున్న విశాఖపట్నం.. దశాబ్దాలుగా బంగాళాఖాతం తీరాన సముద్ర వాణిజ్యానికి, ఓడల నిర్మాణానికి, భారీ పరిశ్రమలకు, తూర్పు నావికాదళ కమాండ్‌కు నిలయంగా గుర్తింపు పొందింది. అయితే దేశంలో ప్రస్తుతం వెల్లువెత్తుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవానికి డిజిటల్ వెన్నెముకగా రూపాంతరం చెందుతూ ఈ నగరం సరికొత్త అవతారాన్ని ఎత్తుతోంది. బెంగళూరు, ముంబై, చెన్నై వంటి స్థిరపడిన ఆర్థిక, సాంకేతిక నగరాలు భూమి కొరత, విపరీతమైన రియల్ ఎస్టేట్ ధరలు, మౌలిక వసతుల రద్దీతో సతమతమవుతున్న వేళ.. విశాఖపట్నం విస్తారమైన భూభాగం, తీరప్రాంత సానుకూలతలతో ఒక ప్రతిష్టాత్మక ప్రత్యామ్నాయంగా అవతరిస్తోంది. ఐటీ రాజధానిగా బెంగళూరు..ఆర్థిక రాజధానిగా ముంబై..ఈ నగరాల మాదిరిగానే దేశ ఏఐ రాజధానిగా విశాఖపట్నం అని చెప్పుకునే స్థాయికి విశాఖ నగరం అవతరించబోతోంది. ఈ భారీ డిజిటల్ రూపాంతరానికి గూగుల్ చేపట్టిన వి15 బిలియన్ల (సుమారు 1.25 లక్షల కోట్లు) క్లౌడ్ ఏఐ హబ్ ప్రాజెక్ట్ మూలస్తంభంగా నిలిచింది. ఇది ఆసియాలోనే అత్యంత భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకటిగా చెప్పుకోవచ్చు. గూగుల్ అడుగుజాడల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా భోగాపురం విమానాశ్రయం సమీపంలో రూ. 1.6 లక్షల కోట్ల వ్యయంతో 1.5 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్ క్లస్టర్.. సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ నిర్మించేందుకు 850 ఎకరాలు కేటాయించుకుంది. వీటితో పాటు సిఫీ డిజిటల్ కనెక్షన్, అనిల్ అంబానీ రీసెంట్ ప్రతిపాదనలు కలిపి ఏకంగా రూ. 6 లక్షల కోట్లకు పైగా నిధులు ఈ నగరంలోకి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆంధ్రప్రదేశ్ నిర్దేశించుకున్న 6 గిగావాట్ల డేటా సెంటర్ లక్ష్యం దాదాపుగా నెరవేరే దిశగా సాగుతోంది. ప్రమాదకరంగా మారబోతోంది రాక ముందే అప్రమత్తం కావాలి. గూగుల్ డీప్‌మైండ్ జజుూ సంచలన వ్యాఖ్యలు. విశాఖ వేగవంతమైన వృద్ధి వెనుక దాని వ్యూహాత్మక భౌగోళిక స్థానం కీలక పాత్ర పోషిస్తోంది. నగరం యొక్క సుదీర్ఘ తీరప్రాంతం సముద్రగర్భ ఫైబర్–ఆప్టిక్ కేబుళ్లకు సరైన ల్యాండింగ్ పాయింట్‌గా మారింది. గూగుల్ అమెరికా ఇండియా కనెక్ట్ వంటి కార్యక్రమాల ద్వారా ఆస్ట్రేలియా, యూరప్, అమెరికాలను కలిపే.. నీటి అడుగున ఉండే కేబుళ్లు వైజాగ్ గుండా వెళ్తున్నాయి. ఇది డేటా ప్రసారంలో అత్యంత తక్కువ లేటెన్సీని (ళ్ఖవఅ౨), అపారమైన బ్యాండ్‌విడ్త్‌ను అందిస్తూ విశాఖను కేవలం దేశీయ సర్వర్ గిడ్డంగిగా కాకుండా గ్లోబల్ డేటా ప్రవాహానికి ప్రధాన ముఖద్వారంగా మారుస్తోంది. అయితే ఈ స్థాయి వృద్ధి అనేక తీవ్రమైన కార్యాచరణ సవాళ్లను కూడా ముంగిట ఉంచుతోంది. హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్లకు అపారమైన విద్యుత్, నీటి శీతలీకరణ మౌలిక వసతులు అవసరం. స్థానిక పవర్ గ్రిడ్‌పై ఒత్తిడి పడకుండా, కాలుష్యాన్ని పెంచకుండా ఉండేందుకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డేటా సెంటర్ పాలసీ 4.0 కింద 100 శాతం పునరుత్పాదక శక్తి (సౌర, పంప్డ్ స్టోరేజ్) వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ సవాళ్లను అధిగమిస్తే స్థానిక సప్లై చైన్ వ్యవస్థ పుంజుకోవడంతో పాటు వేలాది మంది హై–టెక్ నిపుణులకు ఉపాధి లభిస్తుంది. రియల్ ఎస్టేట్, ప్రాజెక్టు ఆధారిత ఆర్థికాంశాల పరంగా చూస్తే.. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, మధురవాడ ఐటీ హిల్స్ పరిసర ప్రాంతాలలో ల్యాండ్ వ్యాల్యూమ్స్ విపరీతంగా పెరిగాయి. ఐటీ కంపెనీలతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఇక్కడ కార్యాలయాలు నెలకొల్పేందుకు మొగ్గు చూపుతున్నాయి. వాణిజ్య రియల్ ఎస్టేట్‌తో పాటు నివాస గృహాల డిమాండ్ పెరగడం ఆర్థిక చక్రానికి ఊతాన్నిస్తోంది. విశాఖపట్నాన్ని పర్యావరణ అనుకూలమైన, కాలుష్య రహిత అంతర్జాతీయ సమాచార సాంకేతిక మరియు పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి



ఎన్. చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ పరిధిలో దుమ్మును రేపే బొగ్గు, ఖనిజాల వంటి భారీ బల్క్ కార్గో కార్యకలాపాలను దశలవారీగా శ్రీకాకుళం జిల్లాలో రాబోయే గ్రీన్‌ఫీల్డ్ ములపేట పోర్టుకు తరలించాలని ప్రతిపాదించింది. మంగళవారం ఈ వివరాలను వెల్లడిస్తూ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి, నగర పరిధి నుండి దుమ్మును వ్యాప్తి చేసే సరుకుల రవాణాను తరలించడం వల్ల వాయు కాలుష్యం గణనీయంగా తగ్గి విశాఖ వాసుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అదే సమయంలో, ఈ సరుకు రవాణా మళ్లింపు వల్ల ములపేట పోర్టు ప్రారంభం నుంచే వాణిజ్యపరంగా లాభదాయకతను సాధిస్తుందని, దానికి తోడు విశాఖ పోర్టులో రద్దీ తగ్గి నౌకల వేచి ఉండే సమయం కూడా మెరుగుపడుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టు భాగస్వామ్య ఫ్రేమ్‌వర్క్ ప్రకారం.. ములపేట పోర్ట్ స్పెషల్ పర్పస్ వెహికల్ లో 49% నుండి 50% వరకు ఈక్విటీ వాటాను పొందేందుకు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆసక్తి చూపింది. దీనితో పాటు మొదటి విడతలో రెండు, రెండో విడతలో మరో రెండు బెర్త్‌ల కేటాయింపుతో పాటు భూముల విలువ మదింపునకు సంబంధించిన ప్రతిపాదనలను పూూా సమర్పించింది. ఆర్థిక మంత్రి పయ్యవుల కేశవ్, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లతో కూడిన మంత్రుల బృందం ఈ ప్రతిపాదనలను నిశితంగా పరిశీలిస్తోంది. ఐఏఎస్ అధికారులు సాంకేతిక, పరిపాలనా మద్దతు అందించనుండగా, సమగ్ర ఆర్థిక నివేదిక ఆధారంగా రాష్ట్ర క్యాబినెట్ దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది. అన్ని రంగాల పరంగా చూస్తే. సాధిస్తున్న ఈ సాంకేతిక పరిణామం భారతదేశపు సాంప్రదాయ ఆర్థిక రాజధానులైన ముంబై, బెంగళూరులకు స్పష్టమైన సవాలు విసురుతోంది. సముద్రతీర సౌకర్యం, అపరిమితమైన గ్రీన్ ఎనర్జీ విధానాలు, అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ నెట్‌వర్క్, ప్రభుత్వ సమర్థవంతమైన సింగిల్ విండో ప్రోత్సాహకాలతో వైజాగ్ సమీప భవిష్యత్తులోనే భారత పారిశ్రామిక, డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని కేపిటల్‌గా అవతరించే దిశగా దూసుకుపోతోంది

# ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు



పశ్చిమ ఆసియాలో రోజురోజుకూ తీవ్రమవుతున్న పరిస్థితులు ఆందోళన కలిగి స్తున్నాయి. అమెరికా, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంతో ప్రపంచ దేశాలు కలవర పాటుకు గురి అవుతు న్నాయి. మధ్యప్రాచ్యం రగిలిన అగ్ని జ్వాలలు రోజు రోజుకూ భీకర రూపం దాల్చు తున్నాయి. అమెరికా ఇరాన్‌ల మధ్య ప్రారంభమైన ఈ ప్రత్యక్ష పోరాటం, ఇప్పుడు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా మొత్తం పశ్చిమ ఆసియా ప్రాంతాన్ని ఒక వినాశకరమైన యుద్ధంలోకి నెట్టివేసే స్థాయికి చేరుకుంది. వరుసగా పదో రాత్రి కూడా యూఎస్ సెంట్రల్ కమాండ్ నేతృత్వంలో అమెరికా వైమానిక దళాలు ఇరాన్ భూభాగంపై విరుచుకుపడ్డాయి. ఇరాన్ మిలిటరీ కమాండ్ కేంద్రాలు, క్షిపణి, డ్రోన్ ప్రయోగ స్థావరాలు, వ్యూహాత్మక వాయు రక్షణ వ్యవస్థలతో పాటు ప్రాముఖ్యత కలిగిన నావికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. అంతర్జాతీయ జలసంధి అయిన హార్ముజ్ గుండా ప్రయాణించే వాణిజ్య, చమురు నౌకల భద్రతను కాపాడటానికే ఈ చర్యలని అమెరికా సమర్థించుకుంటున్నప్పటికీ.. ఈ దాడుల పరిధి క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా దక్షిణ ఇరాన్ పరిధిలోని కీలకమైన బందర్ అబ్బాస్ ఓడరేవు, ఖేష్మ్ ద్వీపం, చబహార్ పరిసర ప్రాంతాలలో భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించినట్లు అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. బుషెహర్ ప్రాంతంలో ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు నిరంతరం క్రియాశీలంగా మారి శత్రు క్షిపణులను ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ పరిస్థితుల మధ్య, ఇరాన్ ప్రాపకం ఉన్న యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు రంగంలోకి దిగడంతో పరిణామాలు మరింత దారుణంగా మారాయి. ఎర్రసముద్రం, బాబ్–ఎల్–మండేబ్ జలసంధి ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై క్షిపణులు, డ్రోన్లతో తాజా దాడులకు తెగబడటమే కాకుండా.. సౌదీ అరేబియాపై నావికా దిగ్బంధనం విధిస్తామని హౌతీలు బహిరంగంగా హెచ్చరించారు. ఈ తాజా హౌతీ దాడులు ప్రాంతీయ రవాణా భద్రతను పూర్తిగా అస్తవ్యస్తం చేయడంతో పాటు యుద్ధం ఇతర అరబ్ దేశాలకు వ్యాపించే సంకేతాలను ఇస్తున్నాయి. ాూశ్రీంశీ =ఖుఎ అమెరికా–ఇరాన్ యుద్ధంలో కీలక మలుపు. జీరో అవర్ హెచ్చరికతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన.. ఈ ప్రాంతీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరాపై తక్షణ ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఒమన్ తీరానికి సమీపంలో హార్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న రెండు ప్రధాన చమురు ట్యాంకర్లపై పేలుళ్లు సంభవించి అవి మంటల్లో చిక్కుకోవడం అంతర్జాతీయంగా చమురు మార్కెట్లను కుదిపేసింది. దాడులకు గురైన నౌకల్లోని సిబ్బందిని సురక్షితంగా బయటకు తరలించినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించినప్పటికీ. అమెరికా తన వైమానిక దాడులను ఆపకపోతే గ్లోబల్ ఎనర్జీ రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ డ్రాస్టిక్ హెచ్చరిక జారీ చేసింది. ప్రపంచానికి అవసరమైన ముడి చమురులో గణనీయమైన భాగం ఈ మార్గం గుండానే సరఫరా అవుతున్నందున.. ఈ హెచ్చరిక ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొత్త వణుకు పుట్టించింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వ్యాఖ్యలతో వైఖరిని మరింత కఠినతరం చేశారు. ఈ యుద్ధ వాతావరణంలో ఏ ఒక్క అమెరికన్ సైనికుడైనా ప్రాణాలు కోల్పోతే.. ఇరాన్ దానికి అనేక రెట్లు ఎక్కువ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఒకవైపు అమెరికా క్షిపణి దాడులు, మరోవైపు ఇరాన్ ప్రతిఘటన, ప్రత్యక్ష బెదిరింపులు, దీనికి అదనంగా ఎర్రసముద్రం, సౌదీ సరిహద్దులలో హౌతీ తిరుగుబాటుదారుల విధ్వంసకర దాడులు కలసి మొత్తం పశ్చిమ ఆసియాను ఒక శ్మశానాల దిబ్బగా మార్చేశాయి. శాంతి చర్చల ఆనవాళ్లు ఎక్కడా కనిపించకపోవడంతో.. రాబోయే రోజుల్లో ఈ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్త ద్రవ్యోల్బణానికి, రవాణా సంక్షోభానికి, సుదీర్ఘ ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తాయేమోనని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

# ఏపీలో రూ.13 కోట్ల జాబ్ స్కామ్

## విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని వందలాది మందిని మోసం చేసిన కపుల్స్

విదేశీ ఉద్యోగాల పేరుతో వందలాది మంది నిరుద్యోగులను నమ్మించి.. రూ. 13 కోట్లకు పైగా ముంచిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక జంట నకిలీ విదేశీ నియామక కన్సల్టెన్సీని నిర్వహిస్తూ.. పలు యూరోపియన్ దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మబలికి వందలాది మంది ఉద్యోగార్థుల నుంచి ఏకంగా రూ. 13 కోట్లకు పైగా వసూలు చేసి మోసగించిన ఆరోపణలపై అరెస్టయ్యారు. విజయవాడ సమీపంలోని పైదురుపాడు గ్రామానికి చెందిన ముసునూరి శ్రీనివాస్, సౌజన్య అనే దంపతులు ఫ్లయింగ్ బోర్డర్స్ పేరుతో కన్సల్టెన్సీ సంస్థలను ఏర్పాటు చేశారు. వీరు నెదర్లాండ్స్, ఐర్లాండ్, లక్సెంబర్గ్, ఫిన్లాండ్ వంటి విదేశాలలో వివిధ హోదాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని సోషల్ మీడియా వేదికలైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రకటనలు ఇస్తూ నిరుద్యోగ యువతను బురిడీ కొట్టించారు. ఈ దంపతులు ఆఫర్ చేసే ఉద్యోగాల కేటగిరీని బట్టి ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 8 లక్షల నుండి రూ. 13 లక్షల వరకు దండుకున్నట్లు పోలీసులు తెలిపారు. తమ నియామక ప్రక్రియ నిజమైనదిగా ప్రతిబింబించేలా చేయడానికి తమ సొంత ముఠా సభ్యులతోనే విదేశీ కంపెనీల ప్రతినిధులుగా నటింపజేసి. నకిలీ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలను కూడా నిర్వహించారు. ఇంటర్వ్యూల అనంతరం అభ్యర్థులకు సెలక్షన్ తుదిలో తప్పిందని లేదా అదనపు ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉందంటూ మరింత డబ్బు గుంజడం కొనసాగించారు. ఎవరైనా ప్రాసెస్ గురించి ప్రశ్నించినా లేదా చెల్లించిన డబ్బులు వాపసు ఇవ్వాలని కోరినా. వారి దరఖాస్తులను రద్దు చేయడంతో పాటు వారి ఫోన్ నంబర్లను బ్లాక్ చేసేవారు. ప్రభుత్వానికి కోటి రూపాయలు పన్ను చెల్లించా.. ఉద్యోగం పోయిన తర్వాత నా బతుకు ఎలా ఉందంటే.. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం విజయవాడలో దాదాపు 700 మంది బాధితుల నుంచి రూ. 11 కోట్లు, విశాఖపట్నంలో సుమారు 130 మంది నుంచి మరో రూ. 2.2 కోట్లు వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయి. ఈ నెట్‌వర్క్ హైదరాబాద్‌లోని కార్యాలయం వరకు విస్తరించి ఉండటంతో అక్కడ కూడా మరికొంతమంది బాధితులు ఉండే అవకాశం ఉందని. విచారణ ముమ్మరమయ్యే కొద్దీ మోసపోయిన బాధితుల సంఖ్య ఇంకా పెరిగే సూచనలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.




మాచవరం, అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్లలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ప్రత్యేక పోలీసు బృందం రంగంలోకి దిగి ఈ దంపతులను అరెస్టు చేసింది. నిందితులు బాధితుల నుంచి వసూలు చేసిన అక్రమ సొమ్ముతో రూ. 2.25 కోట్ల విలువైన స్థిరాస్తులు, రూ. 71.45 లక్షల విలువైన బంగారం, పలు విలాసవంతమైన వాహనాలను కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ జంటపై ఎనిమిది తీవ్రమైన మోసపూరిత కేసులు నమోదై ఉన్నాయని దర్యాప్తు అధికారులు స్పష్టం చేశారు.

# రూ. 92 కోట్లకు చేరిన జొమాటో లాభం

## ఇప్పుడు స్టాక్ కొనచ్చా

జొమాటో మాతృ సంస్థ అయిన ఎటర్నల్ 2026–27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ జూన్ త్రైమాసికం ఫలితాలు ప్రకటించింది. ఏకీకృత లాభంలో ఏడాది ప్రాతిపదికన 268 శాతం పెరుగుదలను నమోదు చేసింది. రూ. 92 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. త్రైమాసిక ప్రాతిపదికన ఎటర్నల్ లాభం 47.1% తగ్గింది. అంతర్గత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ అయిన క్యాతెరో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ తో ఒక వ్యాపార బదిలీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కంపెనీ ప్రకటించింది. నికర ఆర్డర్ విలువ్‌శీ ప్రాతిపదికన 54.2 శాతం, త్రైమాసిక ప్రకారం 15.8 శాతం పెరిగి రూ.31,120 కోట్లకు చేరింది. సంవత్సరం ప్రాతిపదికన సర్దుబాటు చేసిన ఎబిట్డా 223 శాతం, త్రైమాసి ప్రాతిపదిక 29 శాతం పెరిగింది. నికర ఆర్డర్ విలువ 20 శాతం వృద్ధితో రూ.10,769 కోట్లకు పెరిగింది. ఫుడ్ డెలివరీ వ్యాపారంలో వినియోగదారులు చెల్లించిన వాస్తవ డెలివరీ ఛార్జీలు, అలాగే కార్యకలాపాల ఆదాయంలో చేర్చని ప్లాట్‌ఫారమ్ ఫీజులు, ఇతర ఛార్జీలు కూడా కలిసి ఉంటాయి. ఈ త్రైమాసికంలో ఆహార పంపిణీ విభాగం సర్దుబాటు చేసిన ఎబిట్డా రూ.155 కోట్లు పెరిగి రూ.606 కోట్లకు చేరింది. క్విక్ కామర్స్ విభాగం సర్దుబాటు చేసిన ఎబిట్డా రూ.264 కోట్లు పెరిగి రూ.102 కోట్లకు చేరింది. క్విక్ కామర్స్ విభాగంలో కొత్త 200 స్టోర్లు యాడ్ చేశారు. దీంతో మొత్తం స్టోర్ల సంఖ్య 2,443కి చేరింది. హైపర్‌ప్యూర్ విభాగం సర్దుబాటు చేసిన ఆదాయం ఏడాది ప్రాతిపదికన 55 శాతం తగ్గి రూ.1,034 కోట్లకు చేరింది. అదే సమయంలో ఎబిట్డా సానుకూలంగా ఉంది. ఏడాది ప్రాతిపదికన రూ.24 కోట్లు పెరిగింది. ఈ త్రైమాసికంలో రూ.6 కోట్లకు చేరింది. ఫలితాల తర్వాత ఎటర్నల్ షేర్లు అస్థిరం గా మారాయి. చివరికి ఎటర్నల్ షేర్లు 1% పెరిగి ఒక్కో షేరు రూ. 289.5 వద్ద ముగి శాయి. ఈ స్టాక్‌లో ఇప్పుడు కొంత లాభాల స్వీకరణ జరగవచ్చని ఓ విశ్లేషకుడు అంచనా వేశారు. స్విగ్గీ, ఇన్‌స్టామార్ట్, జెప్టో, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్, అమెజాన్ నౌ వంటి ప్రత్యర్థుల దూకుడుతో ఎటర్నల్ క్విక్–కామర్స్ పోటీ పడుతుందా లేదా చూడాలని అన్నారు. ఆరోగ్యకరమైన ఆర్డర్ డిమాండ్, అధిక అడ్వర్టైజింగ్, ప్లాట్‌ఫామ్–ఫీజుల ద్వారా వచ్చే ఆదాయం, ఆపరేటింగ్ లెవరేజ్ కారణంగా ఎటర్నల్ ఫుడ్ డెలివరీ వ్యాపారం లాభపడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం స్టాక్ అధిక వాల్యూవేషన్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.



# రణ్‌వీర్ సింగ్ 'ప్రళయ్'లో దక్షిణాది బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్

## కొత్త జోడీపై పెరిగిన ఆసక్తి



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. యాక్షన్, ఎమోషన్స్ కలగలిపిన కథతో రూపొందుతున్న ఈ సినిమా గురించి వస్తున్న తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికపై అధికారిక ప్రకటన రాకపోయినా, త్వరలోనే చిత్రబృందం పూర్తి తారాగణాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. తదుపరి షూటింగ్ షెడ్యూల్ కూడా త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి రణ్‌వీర్ సింగ్ -- కళ్యాణి ప్రియదర్శన్ కాంబినేషన్ నిజమైతే, ఇది దక్షిణాది -- బాలీవుడ్ కలయికలో మరో ఆసక్తికర జోడీగా నిలిచే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కొత్త జంట వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలంటే అధికారిక ప్రకటనతో పాటు సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే.

# జబర్ధస్త్ బ్యూటీకి బిగ్ బాస్ ఆఫర్.. ఆమె స్పందన ఏంటి?




జబర్దస్త్ కామెడీ షో ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి సత్యశ్రీ ప్రస్తుతం సినిమాల్లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్నారు. టెలివిజన్‌కు దూరంగా ఉంటూ వెండితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, కెరీర్ ఎంపికలు, అలాగే బిగ్‌బాస్ ఆఫర్‌ను ఎందుకు తిరస్కరించారనే విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జబర్దస్త్ తర్వాత సినిమాల్లో మంచి అవకాశాలు రావడంతో టెలివిజన్‌లో తక్కువగా కనిపిస్తున్నానని సత్యశ్రీ తెలిపారు. కెరీర్ ప్రారంభంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని స్వీకరించినప్పటికీ, ఇప్పుడు మాత్రం పాత్రల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని చెప్పారు. ఇప్పుడు నేను ఉన్న దశలో నా ఇమేజ్, రెప్యుటేషన్‌ను దృష్టిలో పెట్టుకుని పాత్రలు ఎంచుకుంటున్నాను. గ్లామర్ ఉన్నంతవరకు మంచి అవకాశాలను సెలెక్టివ్‌గా చేయాలనుకుంటున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన 'అనగనగా ఒక రాజు' చిత్రంలో నటించిన సత్యశ్రీ, హీరో నవీన్ పొలిశెట్టి గురించి కూడా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సెట్స్‌లో నవీన్ ఎప్పుడూ పనిపైనే దృష్టి పెట్టే వ్యక్తి అని, ప్రతి క్షణం సినిమా గురించే ఆలోచిస్తుంటారని చెప్పారు. నవీన్ గారితో మాట్లాడింది చాలా తక్కువ. కానీ ఆయన పని చేసే విధానాన్ని దగ్గరగా చూసే అవకాశం వచ్చింది. 'జాతిరత్నాలు' సమయంలోనే మరో సినిమాలో కలిసి పని చేద్దామని ఆయన చెప్పారు. ఆ మాటను నిలబెట్టుకుని 'అనగనగా ఒక రాజు'లో అవకాశం ఇవ్వడం నాకు చాలా ఆనందంగా అనిపించింది" అని సత్యశ్రీ తెలిపారు. ఇటీవల బిగ్‌బాస్ తెలుగు సీజన్-10 కోసం సత్యశ్రీకి ఆఫర్ వచ్చిందనే వార్తలపై కూడా ఆమె స్పందించారు. ఆ వార్తల్లో నిజం ఉందని, కానీ కుటుంబ పరిస్థితుల కారణంగా ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు.నాకు బిగ్‌బాస్ నుంచి ఆఫర్ వచ్చింది. కానీ నేను మా కుటుంబ బాధ్యతలను చూసుకుంటున్నాను. అమ్మానాన్నలను అంతకాలం వదిలి వెళ్లడం నాకు సాధ్యం కాదు. వారికి తోడుగా ఉండాల్సిన బాధ్యత నాదే. అందుకే ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించాను అని ఆమె చెప్పారు. ప్రతి ఒక్కరికీ కుటుంబం ఉంటుందని, కానీ చాలామందికి వారి బాధ్యతలు పంచుకునే వారు ఉంటారని, తన పరిస్థితి మాత్రం భిన్నమని సత్యశ్రీ వివరించారు. అందుకే కెరీర్ కంటే కుటుంబానికే ప్రాధాన్యం ఇచ్చానని స్పష్టం చేశారు.




# క్రేజీ టాక్.. నందమూరి హీరోను లైన్‌లో పెట్టిన పరశురాం!

సోలో, గీత గోవిందం, సర్కారు వారి పాట ఫ్యామిలీ ఆడియెన్స్‌లో సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు టాలీవుడ్ డైరెక్టర్ పరశురాం. ఈ క్రేజీ డైరెక్టర్ 2024లో వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమా తర్వాత కొత్త ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ఇప్పుడు పరశురాం కొత్త సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఈ సారి నందమూరి హీరోతో సినిమా చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడన్న న్యూస్ ఒకటి తెరపైకి వచ్చింది. ఇంతకీ ఎవరా హీరో అనే కదా మీ డౌటు.. పటాస్ హీరో నందమూరి కల్యాణ్ రామ్. తాజా టాక్ ప్రకారం పరశురాం ఇప్పటికే కల్యాణ్ రామ్‌కు ఓ ఐడియాను చెప్పాడట. కల్యాణ్ రామ్‌కు పరశురాం చెప్పిన బేసిక్ ఐడియా నచ్చిందట. ఈ క్రమంలో పరశురాం పూర్తి స్థాయిలో స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నాడని ఇన్‌సైడ్ టాక్. ప్రస్తుతం కల్యాణ్ రామ్ అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న మల్టీ స్టారర్‌తో బిజీగా ఉన్నాడు. వెంకటేశ్, కల్యాణ్ రామ్ లీడ్ రోల్స్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరతే ఈ మూవీ పూర్తయిన తర్వాత కల్యాణ్ రామ్, పరశురాం సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశమున్నట్టు సమాచారం. క్లాస్, మాస్ టచ్‌తో మంచి సందేశాన్ని జోడిస్తూ.. ఎంటర్‌టైన్ చేసే ప్రయత్నం చేయడంలో ఎప్పుడూ ముందుంటాడు పరశు రాం. మరి ఈ సారి కల్యాణ్ రామ్‌తో ఎలాంటి సబ్జెక్టును రెడీ చేశాడనేది ఆసక్తి నెలకొంది. దీనిపై రాబోయే రోజుల్లో కొత్త అప్‌డేట్ వస్తుందేమో చూడాలి.



# 'టాక్సిక్'పై నిర్మాత ఆసక్తికర వ్యాఖ్యలు.. ఇది పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక చిత్రం

కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే, ఇటీవల విడుదలైన 'మనసాగదే' పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. యశ్, తారా సుతారియా మధ్య సాగే ఈ రొమాంటిక్ ట్రాక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ముఖ్యంగా పాటలోని విజువల్స్, సంగీతం, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.ఈ పాటపై హీరోయిన్ తారా సుతారియా కూడా స్పందించారు. పాటలోని కొన్ని సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారని, చిత్రబృందం విజువల్‌గా అద్భుతమైన అనుభూతిని అందించిందని ఆమె సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. దీంతో ఈ పాటకు మరింత క్రేజ్ ఏర్పడింది. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com